ప్రజాశక్తి

సోమవారం 6 ఫిబ్రవరి 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా





అభద్రతలో పారిశుధ్య కార్మికులు


- ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వైనం
- కంటితుడుపుతోనే సరిపుచ్చుతున్న విఎంసి పాలకవర్గం
- అనాథలుగా బాధిత కుటుంబాలు



గతేడాది డిసెంబర్ 31న ఎక్సెల్‌ప్లాంట్‌లో మృతిచెందిన చక్కా రాజేష్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు అభద్రతల మధ్య వారి జీవనయానం సాగుతోంది. ఎలాంటి భద్రత లేకుండాపోతుండటంతో ఆయా కుటుంబాలు కడు దయనీయ పరిస్థితిని అనునిత్యం ఎదుర్కొంటున్నాయి. ఆదుకోవాల్సిన నగరపాలక సంస్థ కంటితుడుపు చర్యతో సరిపుచ్చుతోంది. తరుచూ ప్రమాదాలకు గురౌతూ పదులు సంఖ్యలోనే కార్మికులు మృత్యువాత పడ్డారు. రోడ్లపై పని చేస్తుండగానే వాహనాలు ఢీకొని పలువురు మరణించిన ఉదంతాలు ఉన్నాయి. అండర్ గ్రౌండ్ డ్రైనేజి (యుజిడి)లోకి దింపి కార్మికులతో పని చేయిస్తున్న క్రమంలో ప్రమాదకరమైన వాయువుల ధాటికి ప్రాణాలు కోల్పోయిన కార్మికులు మరికొందరు ఉంటున్నారు. దీర్ఘకాలిక వ్యాధుల భారిన పడి మృతి చెందుతున్న వారు మరికొందరున్నారు. వివిధ ప్రమాదాల్లో తీవ్రమైన దెబ్బలు తగిలి చేతులూ, కాళ్ళు, ఇతర అవయవాలు పోగొట్టుకున్న కార్మికులు పదులు సంఖ్యలోనే ఉన్నారు. ప్రమాదాల భారి నుంచి కాపాడుకునేందుకు రక్షణ పరికరాలను నగరపాలక సంస్థ అందజేయకపోగా, ప్రమాదకరమైన పనులు చేయిస్తూ, కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని బాధిత కార్మికుల కుటుంబాలు, కార్మిక సంఘాలు వ్యక్తం చేస్తున్నాయి. రాత్రి వేళ పని ప్రదేశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్మికుల్లో సరైన అవగాహన కల్పించకపోవడంతో పారిశుధ్య కార్మికులు పిట్టల్లా రాలిపోతున్నా, (మిగతా 6లో)



రమనీయం...కమనీయం...

కన్నుల పండువగా తిరుపతమ్మ అమ్మవారి కళ్యాణం



అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఉదయభాను దంపతులు

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు

పెనుగంచిప్రోలు శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి కల్యాణం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. పవిత్ర మున్నేటి తీరాన మాఘ మాస శుద్ధ నిండు పౌర్ణమి వెన్నెల్లో లక్షలాది మంది యాత్రికుల మధ్య వేదపండితుల వేద మంత్రోచ్ఛారణ నడుమ సినీ సెట్టింగ్ తరహాలో వివిధ రకాల పూలమాలలుతో శోభాయమానంగా అలంకరించి మండపంలో శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలోని శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఉత్సవ మూర్తులను కళ్యాణ వేదిక మీదకు (మిగతా 6లో)

ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం

- ఆర్టీసీ ప్రయాణం సురక్షితం
- ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు
- ఇంటర్వ్యూలో జిల్లా ప్రజా రవాణాధికారి జి.నాగేశ్వరరావు





ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల కోసం మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా కృషిచేస్తున్నామని జిల్లా ప్రజారవాణాధికారి పి.నాగేశ్వరరావు తెలిపారు. బస్సు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ప్రయాణీకులకు సేవలందించడంలోనూ ముందంజలో ఉందని చెప్పారు. ఆదాయార్జనలో భాగంగా ఎఎస్ పద్ధతుల్లో ఆర్టీసీ స్థలాలను లీజుకు ఇస్తున్నామన్నారు. ప్రయాణీకులకు అందిస్తున్న సేవలపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వివరించారు.

ప్రశ్న: ప్రయాణీకులకు ఆర్టీసీ బస్సులు ఎన్ని అందుబాటులో ఉంటున్నాయి?

జవాబు: నైట్ రైడర్, గరుడ, ఇంద్ర సర్వీసులు 14, సూపర్ లగ్జరీలు 40, అల్ట్రాడీలక్స్ 29, ఎక్స్‌ప్రెస్ 21, పల్లెవెలుగు 97, అల్ట్రా పల్లెవెలుగు 8, సిటీ బస్సులు 82, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు పలు రూట్లలో తిరుగుతున్నాయి. 303 ఆర్టీసీ సొంత బస్సులు, మరో 131 అద్దె బస్సులు మొత్తం 434 సర్వీసులకు సంబంధించి పలు రూట్లలో రోజువారీ 1.46 లక్షల కిలోమీటర్లు తిరుగుతున్నాయి. 99 వేల మంది ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. రూ. 52.20 లక్షలు ఆదాయం వస్తోంది.

ప్ర : నూతన సర్వీసులు ఏమైనా ప్రవేశ పెడుతున్నారా?

జ: త్వరలో మిడిల్ క్లాస్‌కు అందుబాటులో ఉండటానికి నాన్ ఏసీ స్లీపర్ బస్సులను ప్రవేశపెడుతున్నాం. మచిలీపట్నం, గుడివాడ డిపోల నుంచి హైదరాబాద్‌కు ఈ సర్వీసులు నడుస్తాయి. ఏసీ బస్సులకన్నా వీటి ఛార్జీలు రూ.150 తక్కువగా ఉంటుంది.

ప్ర : ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: ప్రతి డిపోలోనూ అనుభవం కలిగిఉండటంతోపాటు యాక్సిండెంట్ ఫ్రీ ట్రాక్ రికార్డు ఉన్న డ్రైవర్‌ను సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్‌లను నియమించాం. డ్రైవింగ్‌పై ఆయా డిపోల్లో వారితో శిక్షణ ఇప్పిస్తున్నాం. డ్రైవర్లకు డ్యూటీ ఇచ్చే ముందుగానే మద్యం తాగి ఉన్నారా? లేదా? అనే పరీక్షలు రోజువారీ నిర్వహిస్తాం. మద్యం తాగి ఉన్నట్లు తేలితే డ్యూటీ నిలిపివేస్తాం. వాహనాలను నాలుగు రకాల మెయింటినెన్స్ చేస్తాం. డైలీ, వీక్లీ, మంత్లీ, క్వార్టర్లీ బస్సు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తాం.

ప్ర: ఆక్యుఫెన్సీ పెంచడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: గిఫ్ట్ స్కీంలు ప్రవేశపెట్టాం. ప్రతి 15 రోజులకు ఒకసారి ప్రయాణీకులకు డ్రా తీసి బహుమతులు అందిస్తున్నాం.

ప్ర: బస్సు పాస్‌లు, రాయితీలు ఎవరెవరికి ఇస్తున్నారు?

జ: విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, వికలాంగులు, స్వాతంత్ర్య (మిగతా 6లో)

సిపిఎస్ రద్దయ్యే వరకూ పోరాటం

యుటిఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడ, మచిలీపట్నంలో ధర్నాలు



మచిలీపట్నంలో దీక్షలో పాల్గొన్న ఉపాధ్యాయులు



విజయవాడలో దీక్షను ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్, కలెక్టరేట్ (కష్ణా)

గన్నవరం ధర్మస్థలిలో సంకల్ప దీక్షను ప్రభుత్వం పోలీసులతో భగ్నం చేసినందుకు నిరసనగా, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలనీ, పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్‌చేస్తూ యుటిఎఫ్ ఎన్‌టిఆర్ విజయవాడ, కృష్ణాజిల్లా శాఖల ఆధ్వర్యంలో విజయవాడ, మచిలీపట్నంలోని సంఘ కార్యాలయాల వద్ద ఆదివారం దీక్షలు జరిగాయి. ఉపాధ్యాయులు ఈ దీక్షల్లో పాల్గొని సిపిఎస్ విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా ఆధ్వర్యంలో నగరంలోని యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయం నందు ఒకరోజు సంకల్ప దీక్ష ఆదివారం జరిగింది. ఈ దీక్షను యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శిలు ఎన్.వెంకటేశ్వర్లు, ఎ.కృష్ణసుందరరావు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాత పెన్షన్ తప్ప మరేదీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు లాభం లేదన్నారు. 33 శాతం ఎలా పాత పెన్షన్‌కు సమానమో చెప్పాలని డిమాండ్ చేశారు. జిపిఎస్‌లో (మిగతా 6లో)

లలితాదేవి త్యాగాలు స్ఫూర్తిదాయకం : రామకృష్ణ

ప్రజాశక్తి-విజయవాడ : భారత కమ్యూనిస్టు పార్టీ తొలితరం నేత మొదుమూడి లలితాదేవి, శ్రీహరిరావుల త్యాగాల ప్రేరణతో కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు కొనసాగించాలని సీపీఐ అగ్రనాయకులు అన్నారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్. కోటేశ్వరరావు అధ్యక్షతన లలితాదేవి 25వ వర్ధంతి సభ విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ సీనియర్ నాయకులు ఈడ్పుగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ జాతీయోధ్యమ కాలంలో చారిత్రక ప్రాశస్త్యం కలిగిన బందరు పట్టణంలో కమ్యూనిస్టు పార్టీని అభివృద్ధి చేసి పార్టీకి, విశాలాంధ్ర పత్రికకు చిరునామాగా నిలబెట్టిన ఘతన శ్రీహరిరావు, లలితాదేవి దంపతులకే చెందుతుందని వారిద్దరిని విడిగా చూడలేమన్నారు. దివి తాలూక నుంచి బందరు వచ్చి బలంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఎదురొడ్డి సోషలిస్టు భావాలతో కమ్యూనిస్టు పార్టీని అభివృద్ధి చేశారని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ సంపదలు, పదవులు ఉన్నా జీవితంలో అనుభవించిన కష్టాలు త్యాగాలు వృదాపోవు అనటానికి లలితాదేవి జీవితం ఒక ఉదాహరణ అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జల్లి విల్సన్ మాట్లాడుతూ పోలీసులు, ప్రభుత్వాల దమనకాండ పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీని గౌరవనీయమైన స్థానం నిలబెట్టేందుకు శ్రీహరిరావు, లలితాదేవి కృషి చేశారని తెలిపారు. చల్లపల్లి రాజా మిగులు భూముల ఉద్యమం చేపట్టి విజయం సాధించారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, కెవివి ప్రసాద్, విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కె అజయ్‌బాబు, మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకులు పి రాణి, పార్టీ జిల్లా కార్యదర్శి సిహెచ్ కోటేశ్వరరావు, కృష్ణాజిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి టి తాతయ్య తదితరులు మాట్లాడారు. లలితాదేవి కుటుంబం నాలుగోతరానికి చెందిన మునిమనువలు చిన్నారులు మొదుమూడి లలితాదేవి, శ్రీహరిరావులు సభకు హజరైన అతిథులకు జ్ఞాపికలను అందించి ముద్దుముద్దు మాటలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్, సీనియర్ నాయకులు వై.చెంచయ్య, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల హనుమన్ పేటలో షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధమైంది.. ఈ సంఘటన లో లక్ష రూపాయల ఆస్తినష్టం జరిగింది. ఇంట్లో సామాన్లు తో సహా కాలి పోవటంతో ఆ కుటుంబం వీధిన పడింది. పెద్దినీడి శివపార్వతి కి చెందిన ఇంటిలో ఆదివారం లో మధ్యాహ్నం 12:30 గంటల ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఇంట్లో వస్తువులు కాలిపోయాయి. అగ్ని ప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.. అగ్ని ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వలన జరిగినదని, ప్రమాదంలో సుమారు లక్ష రూపాయలు మేర నష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారి పూర్ణచంద్ర రావు తెలిపారు. బాధితురాలు శివ పార్వతి భర్త లేరు. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు. కూలి పనులు చేసుకుంటూ ఆమె కంటుంబాన్ని పోషించుకుంటుంది. ఇల్లు, వంట సామాగ్రి తో సహా పూర్తిగా దగ్ధం కావటంతో ఆ కుటుంబం రోడ్డున పడినట్లైంది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు..

బాధిత కుటుంబానికి వేమా 20 వేల ఆర్థిక సహాయం

షార్ట్ సర్క్యూట్ వల్ల ఇల్లు దగ్ధమైన బాధిత కుటుంబాన్ని పట్టణ వైసిపి అద్యక్షుడు, గ్రామ ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు ఆదివారం సాయంత్రం పరామర్శించారు. 20 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బాధితులకు అందజేశారు.

వైభవంగా ప్రతిష్ట మహోత్సవాలు

- భారీగా అన్న ప్రసాద వితరణ

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ పట్టణంలోని శ్రీ అయ్యప్ప దేవస్థానము ప్రాంగణములో ఆదివారం శ్రీ మహాలక్ష్మి గణపతి స్వామి వారి సన్నిదిలో జీవద్వజము, బలిపీఠము, ప్రత్యేక శనైశ్చర స్వామి, నవ నాగదేవతలు, ఆంజనేయ స్వామి వార్ల ప్రతిష్ట మహెూత్సవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తుల రద్దీతో ఆలయం కిటకిటలాడింది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీ ఎత్తున అన్న ప్రసాద వితరణ కార్యక్ర మం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేలు మొండితోక జగన్మోహనరావు, వసంత కృష్ణప్రసాద్, మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వివిధ పార్టీల రాజకీయ నాయకులు ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ నందిగామలో ఎక్కడా లేనివిధంగా శని మహరాజ్ స్వామి విగ్రహ ప్రతిష్ట చేయడం చాలా సంతోషదాయకం, శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానము ప్రాంగణము నందు శ్రీ మహాలక్ష్మి గణపతి స్వామి వారి సన్నిధిలో జీవద్వజము,బలిపీఠము, ప్రత్యేక శనైశ్చర స్వామి, నవ నాగదేవతలు, ఆంజనేయ స్వామి వార్ల ప్రతిష్ట మహెూత్సవాల కార్యక్రమంలో భాగంగా ఇలా వేలాది మంది భక్తులతో పాల్గొనడం ఆనందాన్ని కలిగించిందన్నారు. ప్రజలందరిపై స్వామి వార్ల ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆ భగవంతుడిని కోరుకున్నామని తెలిపారు.శ్రీ సాయి అయ్యప్ప స్వామి దేవస్థానం ఆలయ కమిటీ వారికి మరియు సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు శాఖమూరి వంశీధర్, కమిటీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, భక్తులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ప్రజాశక్తి-ఘంటసాల : వైసీపీ ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పేర్కొన్నారు. ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు ప్రమాణస్వీకారం, అభినందన సభ ఘంటసాలలోని శ్రీ అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామివారి కళ్యాణ మండపంలో ఆదివారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతి థిగా విచ్చేసిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్లో రైతుల బాగు కోరుతూ వారి సంక్షేమానికి సీఎం జగన్మోహన్ రెడ్డి విశేష కషి చేస్తున్నట్లు తెలిపారు. రైతుల పట్ల చిత్తశుద్ధితో వ్యహరిస్తున్న ప్రభుత్వమిది అన్నారు. వైఎస్. రాజశేఖరెడ్డి హయాంలో ఘంటసాల మండలంలోని గుండేరు నదిపై బెడ్ రెగ్యులేటరీ నిర్మాణం గానీ, జగన్మోహన్రెడ్డి హయాంలో లంకపల్లిలో ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టి తాము రైతు పక్షపాతులమని నిరూపించారన్నారు. తడిసిన, రంగుమారినా ధాన్యాన్ని కొనుగోలు చేపట్టడంతోపాటు ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఆగదని, ఈ విషయంలో రైతులు ఆదైర్యపదొద్దన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీని సమర్ధవంతంగా నడిపి శభాష్ అనిపించుకోవాలని పాలకవర్గ సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకట్రావు మాట్లాడుతూ తనకు ఇచ్చిన పదవీ వన్నె తెచ్చేలా రైతు బాగు కోసం పని చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఘంటసాల, శ్రీకాకుళంకు చెందిన వైసీపీ నాయకులు గజ మాలలతో సత్కరించగా, పార్టీల నాయకులు, అధికారులు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. తొలుత మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ వేమూరి వెంకట్రావు, పాలకవర్గసభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహరావు, విజయవాడ కన్వీనర్ బొప్పన భవకుమార్, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ తాతినేని పద్మావతి, జడ్పీటీసీ సభ్యులు తుమ్మల మురళీకష్ణ, ఎంపీపీ వేమూరి రజనీ కుమారి, వేమూరి ప్రవీణ్, పీఎసిఎస్ అధ్యక్షులు రత్నశేఖర్, కుంపటి నాగేంద్ర బాబు, కుంపటి శరత్, పాలకవర్గసభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత కొడాలి నుంచి ఘంటసాల వరకు బైక్ ర్యాలీ ఉత్సాహంగా నిర్వహించారు.



గజమాలతో చైర్మన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రమేష్ బాబు , వైసీపీ నేతలు

13న రహదారుల దిగ్బంధం : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : ఎస్సీ రిజర్వేషన్ కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 13న విజయవాడ నుండి హైదరాబాద్ వరకు గల 65 వ నెంబర్ జాతీయ రహదారి దిగ్బంధం కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం మండలంలోని గండ్రాయి, రామచంద్రుని పేట, అన్నవరం, అనుమంచిపల్లి గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపొంగు సురేష్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ లేకుండా ఆంధ్రప్రదేశ్ లో ఎటువంటి ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టరాదని, ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత చేయకపోతే ఆంధ్రప్రదేశ్ లో బిజెపిని రాజకీయ సమాధికి మాదిగలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 2007వ సంవత్సరంలో ఉషా మెహర కమిషన్ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండా తెలుగు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, బిఆర్ఎస్ పార్టీలు మోసం చేశాయన్నారు. రానున్న కాలంలో బిజెపి ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ చేయాలని లేకపోతే తెలుగు రాష్ట్రాల్లో బిజెపికి పుట్టుకథలు లేకుండా చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి ఉమ్మడి కష్ణాజిల్లా సమన్వయకర్త వెంకటేశ్వరరావు మాదిగ, గుంటూరు జిల్లా సమన్వయకర్త కూచిపూడి సత్యం మాదిగ, కష్ణా జిల్లా కన్వీనర్ కొల్లూరి బసవ మాదిగ, ఆయా గ్రామాల నాయకులు సుక్క యాకోబు, నూకపోగు రవి, సంజీవరావు, వెంకటరత్నం, జ్ఞానయ్య పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్‌కు ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి -తిరువూరు : ఆధార్ కార్డు అప్ డేట్ చేయించుకునేం దుకు సచివాలయాలలో ప్రత్యేక శిబిరా లు ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ సురేష్ బాబు తెలిపారు. 7వ తేదీ చిం తలపాడు, 8వ తేదీ జి.కొత్తూరు, 9వ తేదీ ఎర్రమాడు,10వ తేదీ లక్ష్మీపు రంలో శిబిరాలను ఏర్పాటు చేశామని, ఇవి ఆయా సచివాలయాల కార్యద ర్శుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆధార్ అప్డేడ్ శిబిరా లలో 15 సంవత్సరాలు వయస్సు దా టితే తప్పని సరి గా సరిచేయించుకోవాలన్నారు. 5 సంవత్సరాలు దాటిన పిల్ల లకు కూడా తప్పని సరిగా అప్డేట్ చేయించుకోవాలని చెప్పారు. 60 సంవత్సరాలు దాటిన వారు కూడా బయోమెట్రిక్ అప్డేట్ చేయించు కోవచ్చని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల- పరిటాల గ్రామాల మధ్య నక్కలంపేట క్రాస్ రోడ్ సమీపంలో 65వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఇబ్రహీంపట్నం మండలం కొటికలపూడి గ్రామానికి చెందిన పప్పుల గోపయ్య కంచికచర్ల నుండి ద్విచక్ర వాహనంపై కోటికలపూడి వెళుతుండగా నక్కలంపేట క్రాస్ రోడ్ వద్ద ఎదురుగా వస్తున్న కారు గోపయ్య ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో గోపయ్య కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాల పాలయ్యాడు. సంఘటన స్థలానికి చేరుకున్న సిఐ నాగేంద్ర కుమార్ క్షతగాత్రుడిని 108 వాహనంలో విజయవాడ తరలించారు. ఈ సంఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్కూల్ గేమ్స్ సైక్లింగ్ ఎంపికలు

ప్రజాశక్తి - విజయవాడరూరల్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జిఎఫ్‌ఐ) కష్ణా జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో విజయవాడ రూరల్ మండలం నున్నలోని వికాస్ లో ఎంపికలు జరిగాయి. ఈ ఎంపిక ట్రయల్‌లో జిల్లా నుంచి దాదాపు 60 మంది సైక్లిస్టులు పాల్గొన్నారు. కష్ణా జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ సహకారంతో ఎస్‌జిఎఫ్‌ఐ కష్ణా జిల్లా అండర్-14, 17 కార్యదర్శి తోట అజయ్ కుమార్ ఎంపిక ట్రయల్స్ నిర్వహించారు. ఫిబ్రవరి 12, 13 తేదీల్లో అండర్-17, 19 బాలబాలికల అంతర్ జిల్లా సైక్లింగ్ ఛాంపియన్‌షిప్, ఫిబ్రవరి 16 నుంచి 17 వరకు అండర్-14 ఛాంపియన షిప్‌ను నరసరావుపేటలో నిర్వహించనున్నారు.

అండర్ -14 బాలురు: బి కార్తికేయ (ఎన్ఎస్ఎం స్కూల్, విజయవాడ), వి ప్రవీణ్ (ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్, విజయవాడ), ఎం హర్షిత్ కుమార్ (జెడ్‌పిహెచ్ స్కూల్, ఉంగుటూరు), ఎ షణ్ముఖ్ ((ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్, విజయవాడ).

అండర్-14 బాలికలు: సిహెచ్ అంబికా లలిత (ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్, విజయవాడ), జి నిఖిత (జెడ్‌పిహెచ్ స్కూల్, ఉంగుటూరు), డి లక్ష్మీబాయి (జెడ్‌పిహెచ్ స్కూల్, నున్న), కె జయశ్రీ (ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్, విజయవాడ).

అండర్ -17 బాలురు: కె శైలేష్ కుమార్ (ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్, విజయవాడ), ఎస్ చైతన్య (జెడ్‌పిహెచ్ స్కూల్, ఉంగుటూరు), దాసరి రామ్ చంద్ శ్రీ ఈశ్వర్ (జెడ్‌పిహెచ్ స్కూల్, నున్న), పి బరణి ప్రసాద్) (ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్, విజయవాడ).

అండర్-17 బాలికలు: బి శశాంక (ఎన్ఎస్ఎం స్కూల్, విజయవాడ), బి శిరీష, ఎస్కె సరియ (ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్, విజయవాడ), వై నందిని (జెడ్‌పిహెచ్ స్కూల్, ఉంగుటూరు).

అండర్ -19 బాలికలు: జి అక్షయ, కె లిఖిత (ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్, విజయవాడ), డి పూజిత (జెడ్‌పిహెచ్ స్కూల్, నున్న), బేబీ రాణి (జెడ్‌పిహెచ్ స్కూల్, ఉంగుటూరు).

అండర్ -19 బాలురు: ఎ సాత్విక్ (శ్రీ చైతన్య జూనియర్ కళాశాల, విజయవాడ), ఎస్ శ్రీనివాస్, టి నాగ లోకేష్, ఎ తారకేశ్ (ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్, విజయవాడ).

పూర్తిగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- కౌలు రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-ఘంటసాల : ప్రభుత్వం రైతుల వద్ద నుంచి చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు శీలం నారాయణరావు, వాకా రామచంద్రరావులు డిమాండ్ చేశారు. ఆదివారం ఘంటసాలలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనాలోచితంగా ధాన్యం కొనుగోళ్లు నిలిపివేసిందన్నారు. ఇంకా చాలా మంది రైతుల వద్ద ధాన్యం ఉన్నప్పటికీ కొనుగోళ్లు నిలిపివేసి రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. జిల్లా స్థాయి అధికారులు ఆర్.బి.కేల వద్ద ధాన్యం కొనుగోళ్లు నిలిపి వేయటంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. రంగుమారిన, తడిసిన ధాన్యాన్ని సైతం రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తామని బూటకపు మాటలు చెప్పి నేడు ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయటంతో రైతులు ఆందోళనకు లోనవుతున్నారని అన్నారు. రైతు సంక్షేమ ప్రభుత్వమని మాయమాటలు చెప్పే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. దళారీ వ్యవస్థను రూపుమాపుతామని చెప్పి ఆర్.బి.కేలో ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పి చివరికు రైసు మిల్లర్ల చుట్టూ తిరిగి రైతులు ఈ సీజన్లో ఆర్థికంగా నష్టపోయారన్నారు. రైతు భరోసా కేంద్రాలలో తేమశాతం ఒకలా, రైసు మిల్లుల వద్ద మరొకలా తేమశాతం చూపించటంతో రైతన్న ఈ ఇబ్బందులు పడలేక ఆర్థికంగా నష్టపోయి ధాన్యం అమ్మేసి చేతులు దులుపుకున్నాడని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇంకా ధాన్యం కొనుగోళ్లు చేయాల్సి ఉన్నప్పటికీ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయటం దారుణమన్నారు. రైతులు ఏమీ చేయాలో పాలుపోక ఆందోళన చెందుతున్నాడని, తక్షణమే ప్రభుత్వం స్పందించి మిగిలి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మండల, జిల్లా కేంద్రాల వద్ద ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.

వాణీ జయరామ్ మృతికి సంతాపం

ప్రజాశక్తి-అవనిగడ్డ : సుప్రసిద్ధ గాయని వాణీజయరాం ఆకస్మిక మరణం దిగ్భ్రాంతికి గురిచేసిందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ సంతాపం తెలిపారు. ఆమె మృతి చెందిన వార్తను విని నమ్మలేకపోయానని పేర్కొన్నారు. తన గానామృతంతో గాలిలో తేలినట్టు ఆకాశంలో విహరించినట్టు శ్రోతలను తన్మయులను చేసి అపూర్వ గాయనీయ మణిగా ఆమెను పేర్కొన్నారు. కళాతపస్వి కె.విశ్వనాథ్ తమ చిత్రాల్లో ఆమెతో పాటించిన పాటలు తెలుగువారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-నాగయలంక : అనారోగ్యంతో బాధపడుతున్న వద్ధునికి శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు ఆర్థిక సాయం అందించారు. మోపిదేవి మండల పరిధిలోని ఉత్తర చిరువోలులంక గ్రామానికి చెందిన నడకుదిటి ఆంజనేయులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు శ్యామ్ కిషోర్ దష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన శ్యామ్ కిషోర్ ఆదివారం తన వంతుగా రూ. 5 వేల నగదును అందించారు. శ్యామ్ కిషోర్ ప్రేరణతో మాజీ యంపిటిసి సభ్యులు లంకె మస్తాన్ రూ. 1,000, తెలుగుదేశం పార్టీ గ్రామ కన్వీనర్ రూ. 1,000 నగదులను అందజేశారు. బచ్చు శ్రీనివాసరావు, విశ్వనాథపల్లి వేణు, ఒడుగు శంకరరావు, చింతా గోవిందరాజులు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగులు- వేతనాలు-చట్టబద్ధత మార్గదర్శకాలుపై చర్చావేదిక

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యో గుల సంఘం కృష్ణాజిల్లా ఆధ్వర్యంలో 'ఉద్యోగులు- వేతనాలు-చట్టబద్దత మార్గదర్శకాలు'పై మంగళవారం - సాయంత్రం 4.30 గంటలకు. ఉద్యోగ సంఘాల చర్చా వేదిక నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్ష కార్యదర్శులు పి.రాము, తోట వరప్రసాద్ తెలిపారు. మచిలీపట్నం వలంద పాలెం పెడన్ మెయిన్ రోడ్డు జి కన్వెన్షన్ హాలులో ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు.

పశువైద్యశాల, పాఠశాల భవనాల ప్రారంభం



మాట్లాడుతున్న శైలజ కిరణ్

ప్రజాశక్తి-పెదపారుపూడి : రామోజీ ఫౌండేషన్ దత్తత గ్రామమైన పెదపారుపూడిలో నూతన భవనాలు, వ్యవసాయ సహకార బ్యాంకు, పశు వైద్యశాల, ఎంపియుపి పాఠశాల భవనాలను మేనేజింగ్ డైరెక్టర్ మార్గదర్శి చిట్ ఫండ్స్ చెరుకూరి శైలజ కిరణ్ ప్రారంభించారు. అనంతరం శైలజ మాట్లాడుతూ రామోజీరావు తల్లి దండ్రులు చెరుకూరి వెంకట సుబ్బయ్య, సుబ్బమ్మ పుట్టి పెరిగిన గ్రామానికి సేవ చేయడంలో ఎంతో ఆనందదాయకమని, ఆయన ఎప్పుడూ పదిమందికి ఉపయోగపడే పనిచేస్తారని అన్నారు. పెదపారుపూడి గ్రామం ఆదర్శవంత గ్రామంగా తీర్చిదిద్దాలని ఆయన ధ్యేయమని ఆమె తెలిపారు. దాతల సహకారము మరువలేమని సర్పంచి సిహెచ్ సమీరా అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు తుమ్మల కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కాజా విజయలక్ష్మి, పాలడుగుల చంద్రశేఖర్‌రావు, గారపాటి నాగబాబు, రావు పునుకొల్లు శివరామకష్ణ ప్రసాద్ పాల్గొన్నారు

జగన్నన విదేశీ విద్యా దీవెనతో మోసం : టిడిపి



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కష్ణా) : మూడున్నర సంవత్సరాల నుండి ఇవ్వని విదేశీ విద్య ఎన్నికల ముందు ఇచ్చి మభ్య పెట్టడం ఎంత వరకు సబబు అని టిడిపి నాయకులు విమర్శించారు. స్థానిక టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎండి ఇలియాస్ భాష, పిపళ్ళ వెంకట కాంతారావు మాట్లాడారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 4923 మంది విద్యార్థులకు సహాయం అందిస్తే నేడు వైసీపీ ప్రభుత్వం ఎన్నికల సంవత్సరంలో కేవలం 213 మందికి మాత్రమే ఇచ్చి మోసం చేశారన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.318 కోట్ల బకాయిలు చెల్లించలేదన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో 300 మంది ఎస్సీ విద్యార్థులకు అమలు చేస్తే వైసీపీ ప్రభుత్వం కేవలం 30 మందికి మాత్రమే అవకాశం కల్పించిందన్నారు. నిబంధనలు కఠినతరం చేయడంతో ఎస్టీ, ఎస్సీ, బీసీ, కాపు, మైనార్టీ, బ్రాహ్మణ, వైశ్య విద్యార్థులు దగా పడ్డరన్నారు. ఇప్పటికైనా వైసిపి ప్రభుత్వం దగాను విదేశాల చదువుకున్న విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు చిత్తజల్లు నాగ రాము, బురకా బాలాజీ, పివి ఫణి కుమార్ పాల్గొన్నారు.

ఆసక్తికరంగా గన్నవరం రాజకీయం

ప్రజాశక్తి-గన్నవరం : రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత చైతన్యం కలిగిన నియోజకవర్గాల్లో గన్నవరం ఒకటి. ఇక్కడ జరిగే రాజకీయ పరిణామం ఏదైనా రాష్ట్రస్థాయిలో సంచలనమే. అధికార వైసీపీతో పాటు విపక్ష టీడీపీకి కూడా ఈసారి నియోజకవర్గంలోని రాజకీయం అంతుబట్టడం లేదు. టీడీపీ రాజకీయం ఇప్పుడు రోజుకో మలుపు తిరుగుతోంది. అభ్యర్థి ఎవరైనేది కూడా ఇప్పుడే చెప్పలేని పరిస్థితి నెలకొంది. గత ఎన్నికల్లో రాష్టమంతా వైసీపీ గాలి వీచినా గన్నవరంలో మాత్రం టిడిపి నుంచి ఎమ్మెల్యేగా డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ విజయం సాధించారు. ఆ తర్వాత రాజకీయం మరిన్ని మార్పులకు లోనైంది. ఆ తదనంతర పరిణామాల్లో ఎమ్మెల్యే వంశీ వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వైసిపి నుంచి పోటీ చేసి ఓడిన యార్లగడ్డ వెంకట్రావు ఓడిపోయారు. ఆ తర్వాత నుంచి రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. పార్టీలో క్రియాశీలకంగా ఉండి గతంలో పోటీ చేసి ఓడిన డాక్టర్ దుట్టా రామచంద్రరావు కూడా రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ప్రారంభంలో వంశీతో కలిసి పని చేస్తామని చెప్పిన ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో వంశీకి తాను పనిచేయబోనని ఆయన తెగేసి చెప్పడంతో రాజకీయం మరింత వేడెక్కింది. మరోవైపు నియోజకవర్గం వదిలి వెళ్లిన యార్లగడ్డ వెంకట్రావు ఫంక్షన్ల పేరుతో అప్పుడప్పుడు నియోజకవర్గంలో తళుక్కున మెరిసి వంశీ పై పలు కామెంట్లు చేస్తూ రాజకీయాలను మరింత వేడెక్కిస్తున్నారు. అయితే వైసీపీ టిక్కెట్టుపై వంశీ పోటీ చేయడం ఖాయ మనేది తేటతెల్లమైంది. వంశీ, యార్లగడ్డ, దుట్టా మూడు గ్రూపులుగానే తమ అనుయాయులతో ఉంటున్నారు.



వంశీ | దుట్టా రామచంద్రరావు | యార్లగడ్డ వెంకట్రావు | బచ్చుల అర్జునుడు

దోలాయమానంలో టిడిపి?

గన్నవరం నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా తానే పోటీచేస్తానని టిడిపి జిల్లా అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు బచ్చుల అర్జునుడు ఘంటాపథంగా చెబుతున్నారు. ఏదో ఒక పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తూ నియోజకవర్గంలోనే ఉంటూ పనిచేస్తున్నారు. ఇటీవల ఆయన తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. వంశీకి ధీటైన అభ్యర్థిని దించితే మంచిదనే యోచనలో టిడిపి సీనియర్ల నుంచి వ్యక్తమవుతున్నట్లుగా సమాచారం. ఇదే విషయాన్ని చంద్రబాబు దృష్టికి సైతం తీసుకెళ్లినట్లుగా సమాచారం. యార్లగడ్డ వెంకట్రావు టిడిపిలోకి చేరతారనే ఊహాగానాలు కూడా ఉన్నాయి. బచ్చుల అర్జునుడుతో మండల స్థాయి నాయకుల మధ్య కొంతమేరకు కుమ్ములాటలు కూడా కొనసాగుతున్నట్లుగా సమాచారం. అర్జునుడు స్థానంలో మరొకరిని పెట్టాల్సివస్తే విజయవాడ తూర్పు శాసనసభ్యులు గద్దె రామ్మోహన్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు లేదా పట్టాభి పేర్లు పరిశీలించే అవకాశాలు ఉన్నట్లుగా తెలుస్తోంది.



స్వామిదాసును సత్కరిస్తున్న దృశ్యం

కళాకారులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

ప్రజాశక్తి-గుడివాడ : పట్టణ కళాకారుల సంఘం సేవా రంగంలో మరింత ముందుండి సేవా కార్యక్రమలు నిర్వహించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. శనివారం రాత్రి స్థానిక ఎన్‌జీవో హూామ్‌లో పట్టణ కళాకారులు సంఘం ఆధ్వర్యంలో సంఘ ఉపాధ్యక్షులు, ఉపాధ్యాయులు పాము స్వామిదాస్ దంపతులను ఘన సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కతి సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. స్వామిదాస్ స్వర సుధా రత్న అనే బిరుదును సంఘ సభ్యులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు నేరుసు చింతయ్య, వైద్యులు గొర్జి సత్యనారాయణ, బండారు శ్యాంకుమార్, అధ్యక్షులు కొడాలి రాజా, కోశాధికారి ఎస్ కోటేశ్వరి, సభ్యులు పివిఎన్ కష్ణ, తదితరులు పాల్గొన్నారు.

త్రివేణిలో అండర్-7 ఓపెన్ గర్ల్స్ సెలక్షన్స్ చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక పాటిమిద గల త్రివేణి పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం జిల్లా అండర్ సెవెన్ ఓపెన్ గర్ల్స్ సెలక్షన్స్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన చిన్నారులకు త్రివేణి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ నిమ్మగడ్డ శివశంకర్, ప్రిన్సిపల్ నిమ్మగడ్డ శైలజాలు క్రీడాకారులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ ఇంత చిన్న వయసులోనే చెస్ టోర్నమెంటులో మెలకువలు నేర్చుకొని, ఆడుతున్న విధానం తమను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. చెస్‌లో మెలకువలు నేర్చుకుంటే మేధస్సు ఎంతగానో పెరుగుతు ందన్నారు. టోర్నమెంట్‌లో సెలెక్ట్ అయిన విద్యార్థులు స్టేట్ లెవెల్‌లో పోటిలలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పణికుమార్, రిఫరింగ్ నరేష్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రజతోత్సవ కళ్యాణ మహోత్సవం

ప్రజాశక్తి-గన్నవరం : స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో రజతోత్సవ కల్యాణ మహొూత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. తొలుత అఖండ దీపారాధన, పుణ్యావచనం, నవగ్రహపూజ జరిపారు. అనంతరం అమ్మవారిని, స్వామివారికి కంకణధారణ, మహాలక్ష్మీ(మాను)కు పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపైకి శ్రీలక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్యస్వామిని తీసుకువ చ్చారు. పలువురు దంపతులు కన్యాదాతలుగా వ్యవహరించగా రాత్రి 8.40 గంటలకు ఆశ్లేష నక్షత్రయుక్త కన్యాలగ్నంలో అమ్మవారికి కల్యాణాన్ని మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోర్చనల మధ్య శాస్త్రోక్తంగా జరిపారు. అమ్మవారి కల్యాణాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అనంతరం ఆలయ నిర్వాహకులు జాస్తి శ్రీధర్, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన జరిపారు. మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావు పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు.



మోడుబారిపోతున్న మొక్కలు, చెట్లు

● నీటి సదుపాయంలేక ఎండిపోతున్న వైనం ● బస్‌హౌస్, సిటీ టెర్మినల్, ప్రధాన బస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలు దెబ్బతింటున్న గ్రీనరీ

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ పరిధిలో గ్రీనరీ మోడుబారిపోతోంది. సరైన నిర్వహణ లేక ఎక్కడికక్కడ దెబ్బతింటుంది. దీనిని పర్యవేక్షించే నాధుడు లేకుండా పోయారు. రాష్ట్ర విభజన సమయములో ఎపిఎస్ఆర్‌టిసి రాష్ట్ర స్థాయి కేంద్రం ఆఫీస్‌గా కొత్తగా ఏర్పాటు చేసిన బస్ హౌస్ పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున గ్రీనరీని అభివృద్ధి చేశారు. అప్పటి ఆర్‌టిసి ఎం.డి నండూరి సాంబశివరావు ప్రోత్సాహం, ఆయన కృషి వల్ల గ్రీనరీని పెద్ద ఎత్తున అభివృద్ధి చేశారు. బస్‌స్టేషన్ పరిధిలో వివిధ రకాల మొక్కలు, చెట్లతో అభివృద్ధి చేసిన గ్రీనరీతో ఎంతో అహ్లాదకర వాతావరణం ఉండేది. కానీ రానురాను గ్రీనరీ దెబ్బతిని, దానిని పర్యవేక్షించే నాధుడే లేకుండా పోయింది. దీని వల్ల విలువైన మొక్కలు, చెట్లు సైతం ఎండిపోతున్నాయి. అయినా అధికారులు, ఉద్యోగుల్లో ఎటువంటి చలనం ఉండటం లేదు. కనీసంగామొక్కలకు నీరు పోసే నాధుడే లేకుండా పోయారని...దెబ్బతింటున్న గ్రీనరీ పరిస్థితే తేటతెల్లం చేస్తుందని చెప్పక తప్పదు. "పచ్చని చెట్లు ప్రగతికి మార్గం" అనే సూక్తి నుంచి ఎపిఎస్ఆర్‌టిసి వైదొలుగుతూ, గ్రీనరీ నిర్వహణను పూర్తిగా విస్మరించారు. దీంతో ఎంతో అందాన్నిస్తూ కళకళలాడే రకరకాల మొక్కలు, పూలమొక్కలు నీరు పోసే నాధుడు లేక ఎండిపోతున్నాయి. స్టేట్ కార్యాలయం (బస్‌హౌస్) ప్రాంగణం ఎదురుగా (సిటీ టెర్మినల్ వైపు) బయట రెండు వైపుల ర్యాంప్‌ల వెంబడిప్లాస్టిక్ కుండీల్లో ఏర్పాటు చేసిన ఎంతో విలువైన పూల మొక్కలతో పాటు ఇతర అందమైన రకరకాల మొక్కలు నీటి వసతి లేక ఎండిపోయాయి. అలాగే దిగువన మొన్నటి వరకు ఉన్న నర్సరీ ఏరియాలో (ఆటో స్టాండ్) కొబ్బరిచెట్లు, వివిధ రకాల మొక్కలు సరైన నిర్వహణ లేక చెట్లు ఎదుగుదల లేకుండా పోతున్నాయి. సంస్థలోని రాష్ట్ర స్థాయి ఆఫీసర్స్ కార్, ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేసే ఏరియాలో వివిధ రకాల మొక్కలు, చెట్లతో ఎంతో పచ్చదనంతో, వనంలాగా అహ్లాదకర వాతావరణంతో ఉండే పరిస్థితి నుంచి సరైన నిర్వహణ లేక కొన్ని మొక్కలు ఎండిపోతూ, పచ్చదనం దెబ్బతింటుంది. నీటితో పాటు పెరుగుతున్న మొక్కలను ఎప్పటికప్పుడు ట్రిమ్మింగ్ చేసే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో మొక్కలు దెబ్బతిని ఎండిపోతున్నాయి. ప్రధాన రహదారినుంచి బస్‌స్టేషన్‌లోకి (ఇన్‌గేట్) సర్వీసులు ప్రవేశించే మార్గం పక్కన (బస్‌ల పార్కింగ్ ప్లేస్) ఏర్పాటు చేసిన మొక్కలు కూడా ఎండిపోతున్నాయి. ఒక వైపున ఏర్పాటు చేసిన గ్రీనరీ మొత్తం ఎండిపోతూ దెబ్బతింటుంటే.. మరొక వైపున కొత్తగా ఒక్క మొక్కను కూడా నాటుతున్న పరిస్థితి బస్‌స్టేషన్ ఆవరణలో ఎక్కడ కూడా లేకుండా పోయింది. ఇప్పటికయినా బస్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లో గ్రీనరీ దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలతో పాటు మరింత గ్రీనరీ అభివృద్ధి కోసం కొత్త కొత్త విలువైన మొక్కలు పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.


బస్‌హౌస్ (స్టేట్) కార్యాలయం ఎదురు ర్యాంప్ పక్కన ఏర్పాటు చేసిన కుండీల్లో ఎండిపోయిన మొక్కలు



జగ్గయ్యపేట డ్రీమర్స్ సిమ్మర్స్ కు పతకాలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం స్విమ్మింగ్ పూల్ లో ఈనెల 4న జరిగిన 5వ ఆల్ ఇండియా మాస్టర్ గేమ్స్, ఈతల పోటీలో జగ్గయ్యపేట డ్రీమర్స్, స్విమ్మింగ్ అసోసియేషన్ నుండి 10 మంది క్రీడాకారులు కోచ్ పోట్టాబత్తిన పాండురంగారావు ఆధ్వర్యంలో పాల్గొని విజయ డంక మోగించారు. మొత్తం 30 పతకాలు సాధించారని, ఇందులో బంగారం 16, వెండి 13, కాంస్యం 1 సాధించారు. మహిళల విభాగంలో పొట్టబత్తిన లక్ష్మి, ఏనుగుల సీతారావమ్మ, ఎస్. ఆది లక్ష్మి, వై ఉషా రాణి పతకాలు సాధించారన్నారు. అలాగే పురుషుల విభాగంలో మోహన్ బాబు, సిహెచ్ మోహన్‌రావు, వి రామ చంద్రనాయక్, ఆర్ సత్యనారాయణలు పతకాలు సాధించారన్నారు. పథకాలు సాధించిన వారికి అసోసియేషన్ ప్రిసిడెంట్ మందడపు శ్రీనివాస్ రావు, సెక్టాటరీ కలాలినరేష్, టీమ్ మేనేజర్ ఏ కళ్యాణ్, కన్వీనర్ యలదండి శ్రీనివాసరావు, కష్ణ స్విమ్మర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు కిషోర్ బాబు, పూర్వ అధ్యక్షులు చెరుకూరి రమేష్, రాకకొండ శ్రీనివాస్, అల్లి శ్రీనివాస్, కుర్ర శ్రీనివాసరావు, అప్పన అయ్యప్ప తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగులకు పెండింగ్ డిఎ, బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-తిరువూరు : రిటైర్డ్ ఉద్యోగులకు పెండింగ్ ఉన్న డి.ఎ. బకాయిలు విడుదల చేయాలని విజయవాడ స్వాతంత్ర్య సమరయోధుల సంఘంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ 4 వతరగతి రెవెన్యూసంఘం ఉద్యోగుల సమావేశంలో ప్రధానకార్యదర్శి మహ్మ ద్ రఫీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కొత్త డి.ఎ. వెంటనే ప్రక టించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహనరెడ్డి వెంటనే ఆదేశాలు జారీ చేయా లని విజ్ఞప్తి చేశారు

టిడ్కో ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : టిడ్కో ఇళ్లకు తలుపులు, రంగులు, కరెంటు వంటి మరమ్మతులు పూర్తిచేసి వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలని సిపిఎం పార్టీ నాయకులు కాకనబోయిన లింగారావు, కోటా కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని టిట్కో ఇండ్లను ఆదివారం సిపిఎం నాయకుల బందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడ్కో ఇల్లు పూర్తయి 4 సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఇంతవరకు లబ్ధిదారులకు ఇవ్వకపోవడం దారుణం అన్నారు. పూర్తయిన ఇండ్లకు ప్రస్తుతం రోడ్లు మాత్రమే వేస్తున్నారని, టిడ్కో ఇళ్ల ప్రాంతంలోని చెట్లు పెరిగి అటవీని తలపిస్తున్నాయన్నారు. వెంటనే టిడ్కో ఇళ్ల మధ్యలో పెరిగినటువంటి చెట్లను తొలగించడంతోపాటు రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు నిర్మించి త్వరితగతిన ఇండ్లకు మరమ్మతులు చేపట్టి లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు దంతాల నరేంద్ర, ఎస్ రామనాథం, కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.


టిడ్కో గృహాలు పరిశీలిస్తున్న సిపిఎం నాయకుల బృందం

అవగాహనతోనే కేన్సర్ నియంత్రణ

ప్రజాశక్తి -తిరువూరు : సరైన అవగాహనతోనే కేన్సర్ వంటి వ్యాధులను నియంత్రణ చేయవచ్చని ప్రముఖ కేన్సర్ వ్యాధి నిపుణులు బి. శ్రావణ్ కుమార్ తెలిపారు. మద్య పానం, ధూమ పానం వంటి చెడు ఆల వాట్లకు దూరంగా ఉంటే క్యాన్సర్ వంటి వాటికి దూరంగా ఉండవచ్చని వివరించారు. తిరువూర సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జనవిజ్ఞానవే దిక (జెవివి), సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం క్యాన్సర్ పై అవగాహన సదస్సు ఆదివారం జరి గింది. ప్రధాన వక్తగా హాజరైన శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ సరైన వ్యా యామం, పౌష్టికాహారంతో క్యాన్సర్ తో పాటు ఇతర వ్యాధులను కూడా నియంత్రణ చేయ వచ్చని తెలిపారు. ఇప్పుడు క్యాన్సర్ ను నివారించదగ్గ వ్యాధిగానే పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రముఖ వైద్యులు వి. రవీంద్ర, జెవివి నాయ కులు ఎం.హరికష్ణ, ఎల్. గంగాధర్, కె. పాపారావు, డి.సుదర్శన్, ఎం.రాంప్రదీ ప్, పి.వి,శరత్, పి.శీనయ్య, ఎం. నాగేం ద్రప్రసాద్ పాల్గొన్నారు.



వైసిపి పాలనలో అవినీతి

● మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

ప్రజాశక్తి-నందిగామ

అవినీతి బురదలో దొర్లాడే వైసిపి పార్టీ నాయకులు తమ ఒంటికంటిన బురదను ఎదుటివారికి పులమాలనుకోనే తీరు శోచనీయం అని మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే సౌమ్య తన కార్యాలయంలో గత కొన్ని రోజులుగా వైసీపీ పార్టీ నాయకుల వ్యాఖ్యలను వారి తీరును ఖండిస్తూ తన కార్యాలయంలో ఒక ప్రకటనలో మాట్లాడుతూ క్రమశిక్షణ బాధ్యత కలిగిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని, అవినీతికి కేరాఫ్ దాచుకోవటం దోచుకోవడానికి అడ్రస్ వైసీపీ పార్టీ అని అన్నారు. ప్రపంచ దేశాల గర్వించదగిన నాయకుడు చంద్రబాబు అన్నారు. స్థానికంగా ఉన్న శాసనమండలి సభ్యుడు గత కొంతకాలంగా మేము సోదరి తంగిరాల సౌమ్య కలిసి పని చేస్తాం అని చెప్పడం చాలా హాస్యాస్పద మన్నారు. వ్యక్తిగతంగా సోదరిగా భావించినందుకు ధన్యవాదాలని, మీ పార్టీతో మీ నాయకులతో కలిసి పని చేయవలసిన అవసరం మాకు లేదన్నారు. నక్కకి నాగలోకానికి ఉన్నంత తేడా మీ పార్టీకి మా తెలుగుదేశం పార్టీకి ఉందన్నారు. అతి కొద్ది రోజులలోనే వైసీపీ పార్టీని భూస్థాపితం చేసి రాష్ట్ర ప్రజానీకం తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టడం తథ్యం అని విమర్శించారు.

సుబ్రహ్మణ్యస్వామి ప్రతిష్ఠా కార్యక్రమాలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : శ్రీగురుధాం ధార్మక్షేత్రంలో శివశ్రీ గేంటెల వెంకట రమణ, వసంత లక్ష్మి గురుదంపతుల ఆధ్వర్యంలో ఆదివారం మాఘపౌర్ణమి పండుగ సందర్భంగా సుబ్రమణ్యస్వామి ప్రతిష్ఠా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటల 12నిముషాలకు స్వామి ప్రతిష్ఠ, విశేష పూజలు, అనంతరం హెూమ పూర్ణాహుతి, తాత్వి కులు గెంటేల వెంకటరమణ గురూజీ అనుగ్రహ భాషణం, అన్నప్రసాద వినియోగం జరిగాయి. ఆత్మీయ గురు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన క్రతువులో శ్రీరామ్ రాజగోపాల్ సహా పలువురు ప్రముఖులు, ఉభ య తెలుగు రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు సహకరించాలి

● టౌన్‌లెవల్ బ్యాంకర్స్ మీటింగ్‌లో విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-విజయవాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన అందరికీ జగనన్న ఇంటి సదుపాయంతో పాటు టిడ్కో గృహాల నిర్మాణాలకు అవసరమైన రుణ సదుపాయాన్ని బ్యాంకర్స్ కల్పించి, పథకం విజయవంతం అయ్యే విధంగా సహకరించాలని విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. విఎంసిలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో టౌన్ లెవల్ బ్యాంకర్స్ మీటింగ్ జరిగింది. నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎన్‌టిఆర్ జిల్లా ఎల్‌డిఎం పి కోటేశ్వరరావు, పలువురు బ్యాంక్ మేనేజర్స్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో మేయర్ మాట్లాడారు . రుణ మంజూరులో చిన్ని చిన్న లోపాలు ఎదురయినా వాటిని పరిగణలోకి తీసుకోకుండా కొంత వరకు నిబంధనలు సడలించి గృహ నిర్మాణాలు పూర్తి చేసేందుకు రుణ సదుపాయం కల్పించి, హౌసింగ్ స్కీమ్ పూర్తి అయ్యేందుకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న గృహాలతో పాటు వివిధ దశల్లో ఉన్న గృహాలన్నీ పూర్తి కావడానికి రుణ సదుపాయం ఎంతో కీలకంగా ఉన్నందున దానిని సాధ్యమైన మేరకు మానవతా దృక్పథంతో బ్యాంకర్లు ఆలోచించి, నిర్ణయం చేయాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ గృహ నిర్మాణ పథకం ఎంతో ముఖ్యమైనం దున, ఎక్కడా ఎటువంటి ఆటంకాలు ఎదురుకాకుండా రుణ సదుపాయం కల్పించినట్లయితే ప్రభుత్వ లక్ష్యం నెరవేరు తుందని, అందుకు ప్రతి బ్యాంక్ మేనేజర్ సహకరించాల్సి ఉంటుందన్నారు. ఎల్‌డిఎం కోటేశ్వరరావు మాట్లాడుతూ స్కీమ్ ముందుకు పోయే విధంగా బ్యాంకర్స్ సహకరాం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో యుసిడి పిఒ కె శకుంతల, ఎస్ డబ్ల్యు, సిఒలు, టిఇఎస్, సిడిఒలు, అధికారులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మేయర్, పక్కన కమిషనర్, ఎల్‌డిఎం

ప్రమాదాల నియంత్రణకు పగడ్బందీగా చర్యలు

కృష్ణాజిల్లా రవాణా అధికారి పి.సీతాపతి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్

రోడ్డు ప్రమాదాల నివారణకు పగడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని కృష్ణాజిల్లా రవాణా అధికారి పి.సీతాపతి చెప్పారు. ఆయన ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. బ్లాక్ స్పాట్స్ ఉన్న ప్రాంతాలపై డ్రైవర్లకు ముందుగానే అవగాహన కల్పిస్తున్నాం. తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను సందర్శించి రవాణా, ఆర్టీసీ, పోలీసు, జాతీయ రహదారులు శాఖల అధికారులు ప్రమాణాలను విశ్లేషించి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించామన్నారు. వివరాలు ఆయన మాటల్లోనే...పరిమితికి మించి ప్రయాణికులను తీసుకు వెళుతున్న ఆటోలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అధికారులు కఠినంగా వ్యవహరించడంతోనే ప్రమాదాలు జరగకుండా ఆస్కారం ఉంటుందన్నారు. అందుకే అధికారులకు మరిన్ని స్పష్టమైన ఆదేశాల జారీ చేస్తున్నామన్నారు. స్మార్ట్ కార్డుల రూపంలో జారీ అవుతున్న డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీలు సెప్టెంబర్ 2021 వరకు జారీ పూర్తయిందన్నారు. అక్టోబర్ 2021 నుండి మార్చి 2022 వరకు జిల్లాలో సుమారు 10 వేల కార్డులు జారీ చేయాల్సివుందన్నారు. ఏప్రిల్ 2022 నుండి కేంద్ర ప్రభుత్వం రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ డిజిటల్ ఇండియా నేపధ్యంలో వాహన్ పరివాహన్ అనే సాఫ్ట్ వేర్ అన్ని రవాణా కార్యాలయాలలో ప్రవేశ పెట్టిందన్నారు. దీంతో డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీలు, తదితర సేవలన్నీ డిజి లాకర్ యాప్‌లో పొందొచ్చునని వివరించారు. రవాణా శాఖ మంజూరు చేసిన అఫిషియల్ డాక్యుమెంట్స్ అన్నీ మొబైల్లో డౌన్లోడ్ చేసుకోవచ్చునని చెప్పారు. 100 శాతం వాహన పత్రాలు ఉండాల్సిన పనిలేదన్నారు. పోలీసులు, ం˘ ఎా ణా ా అధి కారులకు లైసెన్స్, వాహనాలకు సంబంధించిన వివరాలు మొబైల్ యాప్ లోనే చూపించొచ్చునని చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాలు రిజిస్ట్రేషన్ కోసం కొన్ని నిబంధనలు ఉన్నాయని చెప్పారు. 250 వాట్స్ కెపాసిటీ, 25 కిలోమీటర్ పర్ అవర్ (కెఎంపిహెచ్) శక్తి గల వాహనం వరకు వాహన రిజిస్ట్రేషన్, వాహనం నడిపే వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ అవసరం లేదని చెప్పారు. ఆపైన మిగతా వాహనాలన్నింటికీ రిజిస్ట్రేషన్ తప్పనిసరని చెప్పారు. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం తాజాగా పలు కీలక నిర్ణయాలను ఆమోదించిందన్నారు. బ్యాటరీ ఆధారితంగా నడిచే వాహనాలకు రిజిస్ట్రేన్ సర్టిఫికెట్ జారీ, రెవన్యువల్ చార్జీల నుంచి మినహాయింపును కల్పిస్తున్నట్టు ప్రకటించిందన్నారు. తద్వారా దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలును ప్రోత్సహించనట్టు అవుతుందని కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ భావిస్తోందన్నారు. గడువు తీరిన, కాలుష్యానికి కారణమవుతున్న పాత వాహనాలను దశలవారీగా సేకరించి తుక్కుగా మార్చేందుకు కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. కొన్ని రాష్ట్రాల్లో కాలుష్యం తీవ్రత అధికంగా ఉండటంతో 15 సంవత్సారాలు పైబడిన వాహనాలకు రిజిస్ట్రేషన్ రెన్యూవల్ కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వటంలేదన్నారు. అయితే రాష్ట్రంలో నిబంధన సడలింపు వుందని చెప్పారు. 15 ఏళ్ళు పైబడిన ఫిట్నెస్ ఉన్న నాన్ ట్రాన్స్ పోర్ట్ వాహనాలకు అదనంగా 5 ఏళ్ళ పాటు రిజిస్ట్రేషన్ రెన్యూవల్ కల్పిస్తున్నామని చెప్పారు. అదే ఫిట్నెస్ ఉన్న ట్రాన్స్



పోర్ట్ వాహనాలకు మాత్రం ఒక సంవత్సరం పాటు రెన్యూవల్ చేస్తున్నామన్నారు. ఆర్టిఓ సేవలు మరింత సులభతరం కాబోతున్నాయని వివరించారు. కేవలం ఆధార్ ఆధారంగా 83 రకాల ఆన్లైన్ సేవలను ఇంట్లో కూర్చునే పొందే వెసులుబాటు కల్పిస్తోందన్నారు. రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ. ఇంట్లో కూర్చొని డ్రైవింగ్ లైసెన్స్, కండక్టర్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, పర్మిట్, యాజమాన్యం బదిలీ తదితర సేవలను ఇప్పుడు పూర్తిగా ఆన్‌లైన్‌లో పొందే వెసులుబాటు కల్గిస్తోందన్నారు. ప్రజలు ప్రాంతీయ రవాణా కార్యాలయాన్ని సందర్శించాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలు స్వచ్ఛంద ప్రాతిపదికన ఆధార్ సాయంతో లెర్నర్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. డూప్లికేట్ డ్రైవింగ్ లైసెన్స్ జారీ, డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ, అంతర్జాతీయ డ్రైవింగ్ పర్మిట్ సమస్య, కండక్టర్ లైసెన్స్‌లో అడ్రస్ మార్పు, మోటారు వాహన యాజమాన్యం బదిలీ దరఖాస్తు సహా పలు సేవలు ఆన్ లైన ద్వారా పొందే అవకాశం ఉందన్నారు. రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ (ఎంఒఆర్‌టిహెచ్) రవాణా సంబంధిత సేవలను మరింత సులభతరం చేసేందుకు అనేక పౌర-కేంద్రీకృత సంస్కరణలను చేపడుతోందన్నారు. వీటిని ఉపయోగించి తక్కువ ఖర్చుతో ఇకపై మరిన్ని సేవలు పాటు విలువైన సమయాన్ని ఆదా చేసుకోవచ్చునని సీతాపతి వివరించారు.

అసోసియేషన్ పేరును దుర్వినియోగం చేయొద్దు : వెంకయ్య

ప్రజాశక్తి-గన్నవరం

కృష్ణా జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ (607/2022) పేరుతో రిజిస్ట్రేషన్ ఉందనీ, కొందరు దానిని ఉపయోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అధ్యక్షులు, న్యాయవాది తిరివీధి వెంకయ్య తెలిపారు. ఆదివారం స్థానిక సింధూర అపార్ట్మెంట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక



మాట్లాడుతున్న వెంకయ్య

ముందు ఎవ్వరైనా జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ పేరుతో ప్రకటనలు ఇవ్వటం, పోటీలు నిర్వహించటం చేస్తే న్యాయపరంగా వెళ్తామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన ఉత్తమ హ్యాండ్ బాల్ క్రీడాకారులను వెలికితీసి ప్రోత్సాహించటానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. తమ సంఘం రాష్ట్రంలో సత్యనారాయణరాజు నాయకత్వం లో పనిచేస్తున్న రాష్ట్ర సంఘానికి అనుబంధంగా పనిచేస్తోందని వివరించారు. రాష్ట్ర సంఘం క్రీడా ప్రాధికార సంస్థ గుర్తించబడిన సంఘంగా పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటా వెరిఫికేషన్, శాప్ లీగ్ పోటీలు, గోవాలో జరగపోయే జాతీయ క్రీడలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమావేశంలో కూడా సత్యనారాయణరాజు నాయకత్వంలో పనిచేస్తున్న సంఘమే పాల్గొందని గుర్తుచేశారు. ఆయన నాయకత్వంలో నడుస్తున్న రాష్ట్ర సంఘం పోటీల్లో మాత్రమే పాల్గొన్న క్రీడాకారులకు గుర్తింపు ఉంటుందని వివరించారు. త్వరలో జాతీయస్థాయి పోటీలకు సంబంధించి రాష్ట్రస్థాయి జూనియర్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నామని వెంకయ్య తెలిపారు. ఈ సమావేశంలో కృష్ణాజిల్లా హ్యాండ్ బాల్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి డి.ఎన్.రాజు, ఉపాధ్యక్షుడు నక్కా దేవశేషు, జిల్లా అసోసియేషన్ సభ్యులు టి.స్వామి, పి.శివనాగరాజు, పి.కృష్ణకాంత్, మణికంఠ, హేమసుందర్, పి.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ వి.గణేష్ పాల్గొన్నారు.



హంసలదీవి బీచ్‌లో యాత్రికుల రద్దీ

సముద్ర స్నానాలకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి-కోడూరు

కోడూరు మండలం హంసలదీవి గ్రామ సమీపంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కృష్ణా సాగర సంగమం, సముద్ర తీరం వద్దకు పుణ్య స్నానాలు ఆచరించడానికి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాదిగా యాత్రికులు తరలివచ్చారు. సముద్ర తీరంలో సందోహంగా మారింది. అవనిగడ్డ నియోజకవర్గం శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు దంతులు సముద్రునికి ప్రత్యేక పూజలు నిర్వహించి పుణ్య స్నానాలు ఆచరించారు. సాగర సంగమం ప్రదేశంలో అధికారులు ఏర్పాటు చేసిన జల్లు స్నానాలను ప్రారంభించారు. మాఘశుద్ధ పౌర్ణమి రోజు శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి స్వామి కళ్యాణాన్ని తిలకించి సముద్రం తీరంలో పుణ్య స్నానాలు ఆచరించటం ఇక్కడి ప్రత్యేకత. పాలకాయతిప్ప నుంచి సముద్రతీరం వరకు వెళ్లే రహదారిపై వావానదారులకు ట్రాఫిక్ అంతరాయం తలెత్తకుండా పోలీస్ అధికారులు పర్యవేక్షించారు. వేకువజామున కొంత సమయం మాత్రం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నూతనంగా వివాహమైన దంపతులు బ్రహ్మముడులతో సూర్యదోయ సమయంలో సముద్రుడికి ప్రత్యేక పూజలు చేసి స్నానాలు చేశారు. కోడూరు తహశీల్దార్ లతీఫ్ పాషా, అవనిగడ్డ డిఎస్‌పి మహబూబ్ బాషా, అవనిగడ్డ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, కోడూరు ఎస్సై వి.రాజేంద్రప్రసాద్, మెరైన్ పోలీసులు, అటవీశాఖ, వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.



సముద్రుడికి పూజలు చేస్తున్న సింహాద్రి రమేష్‌బాబు దంపతులు

నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

కృష్ణాజిల్లా లో ఆదివారం జరిగినది నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా విద్యాశాఖాధికారి



పరీక్షా కేంద్రంలో తాహేరా సుల్తాన తనిఖీ

తాహేరా సుల్తానా తెలిపారు. జిల్లాలోని 17 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్ష జరిగిందన్నారు. జిల్లాలోని 3 రెవెన్యూ డివిజన్లలో 3 ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారన్నారు. ఉయ్యూరులోని 4 పరీక్షా కేంద్రాలను తాను తనిఖీ చేశానన్నారు. మొత్తం 3482 విద్యార్థులకు గాను 3304 మంది 94.89 శాతం హాజరయ్యారన్నారు. 178 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని వివరించారు.

పంచాయతీకి ఫ్రీజర్ బాక్స్ బహూకరణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

వడ్లమన్నాడు గ్రామపంచాయతీకి రూ.లక్ష విలువ గల ఫ్రీజర్ బాక్స్‌ను మాజీ ఎమ్మెల్యే, గుడివాడ నియోజకవర్గ టిడిపి



బాక్సును ప్రారంభిస్తున్న రావి వెంకటేశ్వరరావు

ఇన్‌ఛార్జి రావి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అందించారు. వడ్లమన్నాడు శివారు కొండిపాలేనికి చెందిన మన్నెం రామారావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు జోగి శ్రీనివాసరావు దంపతులు, కాగిత ఏడుకొండలు దంపతుల సహకారంతో వడ్లమన్నాడు పంచాయతీకి బహుకరించారు. ఈ కార్యక్రమంలో కొండాలమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ బెల్లంకొండ ఏడుకొండలు, పెన్నేరు రమేష్, పామర్తి సత్యనారాయణ, కాగిత విజయ సారథి, పామూరు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

'చదవటం మాకిష్టం' కార్యక్రమం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

చదవటం మాకిష్టం, ఘంటసాల పాటల గానం కార్యక్రమాలను స్థానిక శాఖ గ్రంథాలయంలో సాహితీ స్రవంతి, గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగి పి.నాంచారయ్య ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాహితీ స్రవంతి నాయకులు అవిర్నేని వెంకటేశ్వరరావు ఘంటసాల పాటలను ఆలపించారు. సాహితీ స్రవంతి సభ్యులు బి. వి.శ్రీనివాసరావు పిల్లల చదువులు ఆసక్తిగా ఎలా చదవాలి అనే అంశంపై వివరించారు. ఘంటసాల పై కవిత చదివి వినిపించారు. గ్రంథాలయాధికారిణి టి.వాణి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో హలీం, బి.శివ,ఎ.నవ్యశ్రీ దుర్గ, పి.తేజస్వి, వి.గిరిధర్,వి.లికిత్, బి.చరణ్ తదితరులు పాల్గొన్నారు.



వినాళులర్పిస్తున్న సాహితీ స్రవంతి, గ్రంథాలయాల ప్రతినిధులు

ఎపి చాత్తాద వైష్ణవ సంఘ కార్యాలయం ప్రారంభం



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న శోభనాద్రి, ఎస్పీ యశోద శేషగిరిరావు

ప్రజాశక్తి-భవానీపురం

భవానీపురం హెచ్.బి కాలనీ హెచ్.అర్.టి కాంప్లెక్స్ నందు ఆంధ్రప్రదేశ్ చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, సంఘ సేవకులు టి. శోభనాద్రిచే చాత్తాద శ్రీ వైష్ణవ రాష్ట్ర సంఘం కార్యాలయం అదివారం ప్రారంభించబడింది. అనంతరం రాష్ట్ర సంఘ గౌరవ అధ్యక్షులు, ఆగమ పండితులు టి.ఎం.సూరి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం మరియు విష్ణు సహస్ర పారాయణం అనంతరం రాష్ట్ర సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరలో ఒక స్థల మరియు భవన నిర్మాణానికి కమిటీ ఏర్పాటు చేసి ప్రభుత్వం ద్వారా గానీ, దాతల ఆర్థిక సాయంతో అయినా సాధ్యమైనంత త్వరలో రాష్ట్ర సంఘానికి ఒక భవనం ఏర్పాటు చేయడానికి మనందరం కషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా శోభనాద్రి చారిటబుల్ ట్రస్ట్ వారిచే మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు టి.మంగయ్య, కార్యనిర్వాహక అధ్యక్షులు టి.వి. రమణ, ప్రధాన కార్యదర్శి ఎస్పీ యశోద, చాత్తాద శ్రీ వైష్ణవ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ టి.గీతాంజలి, ఏపీ పిటిడి బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్పీ శేషగిరిరావు, సంఘ ఉత్తరాంధ్ర ఇన్చార్జి తొండా నారాయణమూర్తి, కష్ణా జిల్లా అధ్యక్షులు టి.పూర్ణయ్య, భద్రాచలం సంఘ నాయకులు టి.పున్నయ్య వివిధ జిల్లాల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-వన్‌టౌన్: గణపతిరావు రోడ్డుకు సంబంధించి రూ. 2 కోట్ల వ్యయంతో సిమెంట్ రోడ్డుగా నిర్మిస్తున్నామని పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం స్థానిక కొత్తపేటలోని 51,53,54 డివిజన్లలో జరిగిన శంకుస్థాపన కార్యక్రమాలలో పాల్గొన్న వెలంపల్లి శ్రీనివాసరావు కోటి 99 లక్షల రూపాయల నిధులతో గణపతిరావు రోడ్‌ను సీసీ రోడ్డుగా వేసేందుకు, డ్రైన్ వీధిలో సైడు కాలువలు, రోడ్డు వేసేందుకు, 53వ డివిజన్‌లో నూతన వాటర్ పైపులు వేసేందుకు శంకుస్థాపన చేశారు. అనంతరం వెలంపల్లి మాట్లాడుతూ ప్రజల కోరికను నేడు నేరవేర్చబోతున్నామన్నారు. నియోజకవర్గ అభివద్ధికి కట్టుబడి వున్నామని తెలిపారు. తాము చేసే అభివద్ధిపై చర్చకు సిద్దంగా వున్నామని ఆయన అన్నారు. నగర అభివద్ధికి ప్రోత్సాహం అందిస్తున్న సీఎం జగనన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కష్ణలంక రిటైనింగ్ వాల్ జగన్ హయాంలో నిర్మిస్తున్నామని అన్నారు. చంద్రబాబు గతంలో విజయవాడ నగర అభివద్ధికి ఇచ్చిన నిధులను అమరావతికి బదిలీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్లు మహదేవ్ అప్పాజీరావు, మరుపిళ్ళ రాజేష్, హర్షద్ అయూబ్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు , శ్రీనన్నదళం అధ్యక్షులు పోతిన వర ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

రమనీయం... కమనీయం

తీసుకువచ్చి వివిధ రకాల అలంకరణలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను దంపతులు, కార్యనిర్వహణాధికారి లీలాకుమార్ దంపతులు, ఛైర్మన్ చెన్న కేశవరావు దంపతులు, అమ్మవారి, స్వామి వారి వంశీయులు కాకాని రంజిత్‌కుమార్ దంపతులు, కొల్లా రాజశేఖర్ దంపతులు కల్యాణ పీటలపై కూర్చుని సంప్రదాయ బద్ధంగా శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున సామినేని ఉదయభాను దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ మేరీ ప్రశాంతి, ఏసిపి నాగేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ పద్మకుమారి తదితరులు పాల్గొన్నారు.

అభద్రతలో పారిశుధ్య కార్మికులు

పట్టించుకునే నాథుడే కనిపించడం లేదు.

పదులు సంఖ్యలో కార్మికులు మృత్యువాత....

ఇటీవల కాలంలో తరుచూ జరుగుతున్న పలు ప్రమాదాల్లో పదులు సంఖ్యలోనే కార్మికులు చనిపోయారు. రాత్రి శానిటేషన్ పని చేస్తూనో...లేదా యుజిడి మ్యాన్‌హోల్స్‌లో దిగి పని చేస్తూనో రకరకాల ప్రమాదాల్లో కార్మికులు మృత్యువాత పడ్డారు. బందరురోడ్డులోని దండమూడి రాజగోపాలచారి ఇండోర్ స్టేడియంలో కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న బంగారు గణేష్ (44) గత నెల 13 ఉదయం 6 గంటల సమయంలో నేతాజి బ్రిడ్జి వద్ద రోడ్డు ఊడుస్తుండగా ఆటో వచ్చి వేగంగా వచ్చి ఢీకొనటంతో చనిపోయాడు. గత డిసెంబర్ 31న ఉదయం 9 గంటల సమయంలో వెహికల్ డిపో డ్రైవర్‌గా పనిచేస్తున్న చక్కా రాజేష్ (24) ఎక్సెల్ ప్లాంట్‌లో పని చేస్తున్న సమయంలో బాబ్‌కాట్ అనే వెహికల్ బకెట్ ఇతనిపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సర్కిల్-1లో శానిటేషన్ వర్కర్ బెవర రామలక్ష్మికి నవంబర్ 11న సెలవు. అధికారులు ఆరోజు ఆమెను ప్రత్యేకంగా పిలిపించి కనకదుర్గహైవేపై నైట్ శానిటేషన్ వర్క్ డ్యూటీ వేశారు. పనిచేస్తున్న సమయంలో లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. సర్కిల్-3 పరిధిలో డిసెంబర్ 22న గ్రీన్‌ల్యాండ్ హోటల్ వద్ద జరిగిన ప్రమాదంలో సిల్ట్ బ్యాచ్ కార్మికుడు ముల్కి పెద వెంకటేశ్వర్లు చనిపోయాడు. సూర్యారావుపేటలోని డిజిపి బంగ్లా సమీపంలో డ్రేనేజి ప్రమాదంలో ఎం.ఏసు, జి.నాగరాజులు చనిపోయారు. జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీ నిర్మాణ సమయంలో డ్రెయినేజీ ప్రమాదంలో వెంకటేశ్వర్లు, రాంబాబు మృత్యువాతపడ్డారు. వన్‌టౌన్ భవానీపురం మ్యాన్‌హోల్స్‌లో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. సీతారాంపురం పెట్రోల్ బంక్ వద్ద రాత్రి శానిటేషన్ పనిలో ఉన్న కార్మికుడి మీదుగా కారు వెళ్లిపోయిన ఘటనలో అక్కడికక్కడే చనిపోయాడు. గతేడాది బెంజి సర్కిల్ ఫ్లైఓవర్‌పై శానిటేషన్ పని చేస్తున్న పలువురు కార్మికులను కారు ఢీకొన్న ఘటనలో నాగూర్‌బి అక్కడి కక్కడే మృతిచెందారు. నలుగురు కార్మికులకు కాళ్లు విరిగాయి. ఏప్రిల్ మాసంలో నోవాటెల్ హోటల్ సమీపంలో ఇలాంటి ప్రమాదంలోనే మేస్త్రీ అబ్బులు చనిపోయాడు. ఇలా అనేక మంది మృత్యువాత పడగా, పదులు సంఖ్యలోనే కార్మికులు వివిధ అవయవాలు దెబ్బతిని, జీవితాంతం అవిటి జీవితాన్ని గడపక తప్పడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన నగరపాలక సంస్థ కంటితుడుపు చర్యలతో కార్మికుల కుటుంబాలను తీవ్ర మనోవేధనకు గురి చేస్తోంది. ఎపి మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) బాధిత కార్మికుల కుంటుబాలకు అండగా నిలుస్తూ అనేక సందర్భాల్లో విఎంసి అధికారులతో, పాలకవర్గంతో మాట్లాడి పరిహారం మంజూరు కోసం డిమాండ్‌చేస్తోంది. అయినా పాలకవర్గం తన నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తూనే ఉంది. మృతిచెందిన, క్షతగాత్రులైన బాధిత కుటుంబాలకు పరిహారం, మెరుగైన వైద్య సేవలు అందేలా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఆ దిశగా నగర పాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం

సమరయోధులు, తదితరులకు ప్రయాణ రాయితీ కల్పిస్తున్నాం, ఉమ్మడి జిల్లా పరిధిలో 91, 517 మందికి రాయితీ , ఉచిత బస్ పాస్‌లు ఇచ్చాం.

ప్ర: ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: ఆర్టీసీలో కొరియర్, కార్గో సేవలను సొంతంగా అందిస్తున్నాం. మచిలీపట్నం, గుడివాడ, అవనిగడ్డ, ఉయ్యూరు, గన్నవరం ఐదు డిపోల పరిధిలో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. రోజువారీ 368 పార్శిల్స్ బుక్ అవుతున్నాయి. ఇతర జిల్లాల నుంచి 513 పార్శిల్స్ వస్తున్నాయి. పార్శిల్స్‌ను 24 గంటల్లోపు కస్టమర్లకు అందిస్తున్నాం. రోజువారీ రూ. 67 వేలు ఆదాయం వస్తోంది. బస్టాండ్లలో ఉన్న స్థలాలను ఓఎస్ పద్ధతిలో 15 సంవత్సరాల పాటు లీజుకు ఇవ్వనున్నాం.

ప్ర: బస్ డిపోల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: గుడివాడ డిపో గ్యారేజీని రూ.8 కోట్లతో ఆధునీకరిస్తున్నాం. త్వరలో ఈ పనులు పూర్తవుతాయి. రూ. 20 కోట్లతో ఇంటిగ్రేటెడ్ బస్టాండ్‌గా మార్చడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. బస్టాండ్లలో ప్రయాణీకులకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయి.

సిపిఎస్ రద్దయ్యే వరకూ పోరాటం

మినహాయింపు చేసే 20 శాతం సొమ్ము కార్పొరేట్‌లు నిర్వహించే ప్రయివేట్ సంస్థలలో పెట్టుబడి పెట్టడం ఎలా ప్రభుత్వంకి ఉద్యోగులకు లాభాలు వస్తాయో ప్రభుత్వం చెప్పాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి. మనోహర్ కుమార్ మాట్లాడుతూ సిపిఎస్ స్కీం వల్ల ఉద్యోగుల జీవితాలు పదవీ విరమణ అనంతరం అగమ్యగోచరంగా మారతాయన్నారు. దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో పాలకపక్షాలు సిపిఎస్ రద్దు చేస్తామని ప్రకటనలు చేస్తూ ఓపిఎస్ పునరుద్ధరణకు అడుగులు వేస్తున్నాయన్నారు. కానీ మన ముఖ్యమంత్రి కూడా ఒక వారం రోజులలో రుద్దు చేస్తామని అని పాదయాత్ర సమయంలో హామి ఇచ్చారన్నారు. కాని నేటికీ అమలు కాలేదన్నారు. యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా ప్రదాన కార్యదర్శి ఏ.సుందరయ్య మాట్లాడుతూ 33 శాతం గ్యారంటీతో ఇచ్చే పెన్షన్ ఉపయోగం లేదని, జీపిఎస్ స్కీమ్‌లో ఇచ్చే హెల్త్ కార్డు, హెల్త్ ఇన్సూరెన్స్ కనీస పెన్షన్ వంటి సౌకర్యాలు వలన ఉద్యోగికి పెద్ద ప్రయోజనాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శిలు యం.శ్రీనివాసరావు, ఎం.రత్నకమలబాబు, డి.హరిప్రసాద్, రెడ్ స్టార్ కె.గంగరాజు, పి.భవానీ, రాష్ట్ర కౌన్సిలర్ పాలకొల్లు శ్రీనివాసరావు, ఏ.గోపాలకృష్ణ, నగర ప్రదాన కార్యదర్శి సుబ్బారెడ్డి, లలిత శ్రీ భరత్‌దేవ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బెదిరింపులు, భయభ్రాంతులతో ఉద్యమాలను ఆపలేరని, ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ విధానాన్ని రద్దు చేసే వరకూ అనేక రూపాల్లో తమ ఉద్యమాలను కొనసాగిస్తామని యుటిఎఫ్ కష్ణాజిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు బి.కనకారావు, జె.లెనిన్ బాబు స్పష్టం చేశారు. గన్నవరం ధర్మస్థలిలో సంకల్ప దీక్షను ప్రభుత్వం పోలీసులతో భగ్నం చేసినందుకు నిరసనగా సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలనీ, పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్‌చేస్తూ యుటిఎఫ్ కష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు సంకల్ప దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బి.కనకారావు, జె.లెనిన్‌బాబులు మాట్లాడారు. ఎన్నికల హామీలకు విరుద్ధంగా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పరిపాలన సాగుతోందన్నారు. ప్రశ్నించిన వారిపై బెదిరింపులకు పాల్పడుతూ ,బయ భ్రాంతులకు గురి చేస్తూ ఎంతకాలం పాలన చేస్తారని ప్రశ్నించారు. ఆర్థిక పరమైన సమస్యలు సష్టిస్తూ ప్రతి నెలా ఒకటోతేదీన జీతాలు చెల్లించకుండా ఉద్యోగులను మనోవేధనకు గురిచేయడం అన్యాయమన్నారు. పాత పెన్షన్‌ను పునరుద్ధరించి ప్రతి నెలా జీతాలు సక్రమంగా చెల్లించటానికి, పీఎఫ్, డిఎ చెల్లింపులు తదితర ఆర్థిక సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు కె.ఎ.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ కష్ణాజిల్లా సహాధ్యక్షులు ఎండి షౌకత్ హుస్సేన్ సహాధ్యక్షురాలు జె.ఝాన్సీ, జిల్లా కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వరరావు, అబ్దుల్ హబీబ్, టి.గంగరాజు, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎల్.నరేంద్ర, సభ్యులు జె.ప్రసాదరావు, రాష్ట్ర కౌన్సిలర్ ఆర్.రామారావు, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దుర్గగుడి అధికారుల గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి-వన్‌టౌన్

దుర్గగుడి అధికారుల ఆధ్వర్యంలో ఆదివారం గిరిప్రదక్షిణ కార్యక్రమం జరిగింది. శ్రీ శుభకత్ నామ సంవత్సర మాఘ పౌర్ణమి సందర్భంగా ఆదివారం ఉదయం ఆరు గంటలకు శ్రీ కామధేను అమ్మవారి ఆలయం (ఘాట్ రోడ్) నుండి ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక ఇంజనీరు కె.వి.ఎస్ కోటేశ్వరరావు పాల్గొని పూజలు నిర్వహించారు. గిరిప్రదక్షిణ కార్యక్రమం శ్రీ కామధేను అమ్మవారి ఆలయం, కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్థంబాల సెంటర్, సితార, కబేళా, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, నెహ్రూ బొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి మీదుగా మల్లిఖార్జున మహామండపమునకు చేరుకున్నారు. దుర్గమ్మను దర్శించుకునేందుకు యాత్రికులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పౌర్ణమి మరియు ఆదివారం కావడంతో ఖడ్గమాలార్చన, లక్షకుంకుమార్చన, శ్రీచక్రనవావరణార్చన, చండీహోమం, శాంతి కళ్యాణం ఇతర సేవల్లో యాత్రికులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



'ఇదేం ఖర్మ..మన రాష్ట్రానికి' కార్యక్రమం

ప్రజాశక్తి-బంటుమిల్లి

టిడిపి రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు



బంటుమిల్లిలో

'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం పెడన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాగిత కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్నారన్నారు. నారా లోకేష్ యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి మండల


పెదపారుపూడిలో

అధ్యక్షుడు కూనపురెడ్డి వీరబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా కాశీ, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి బొల్లా వెంకన్న, గ్రామ అధ్యక్షుడు బొల్లా శ్రీను, పాలడుగు వెంకటేశ్వరరావు, బొల్లా రవి, పర్ణం సూరిబాబు, మట్టా బ్రహ్మం, మోహనరావు, భట్టు తంబి తదితరులు పాల్గొన్నారు. **పెదపారుపూడి** : మండలం-జమీదింటకుర్రు గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ - మన రాష్ట్రానికి' కార్యక్రమం జరిగింది. టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్ల కుమార్ రాజా మాట్లాడారు. టిడిపి మండల అధ్యక్షుడు రమేష్ చౌదరి (చంటి), కార్యదర్శి మసిముక్కు రాంబాబు, జాస్తి రామచంద్రరావు, చెరుకూరి విజయ్ కుమార్, లెనిన్‌బాబు, విజయ్ చందర్ పాల్గొన్నారు.

మహాసౌర హోమం


ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం మండలం చిక్కవరంలోని ఉషా పద్మిని సమేత సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో అరుణపారాయణ సహిత మహా సౌర హోమాన్ని వైభవోపేతంగా ఆదివారం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

పేదలను మోసగిస్తున్న పాలకులు : బిఎస్‌పి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

బహుజన రాజ్యాధికార యాత్ర సభకు జగ్గయ్యపేట నుండి వందలాది మంది బిఎస్‌పి నాయకులు, కార్యకర్తలు ఆదివారం తిరువూరు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర అధికార ప్రతిపక్ష పార్టీలు ప్రజలను మోసగిస్తూనే ఉన్నాయన్నారు. ఎస్‌సి, ఎస్‌టీ, బీసీ ప్రజలు రాజ్యాధికారానికి దూరంగానే ఉండాల్సివస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర పాలకులు పేదల సంక్షేమాన్ని పట్టించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొదమల ప్రభుదాస్, ఏ పవన్ కార్తిక్, ఎస్ కె భాష, కె.రాజశేఖర్, పి.శ్రీనాథ్, సి హెచ్ రమణ బి.రమణ కె.హెప్సిబా, కె.వంశీ రాహుల్, ఎస్.రాజేష్, కె వి రత్నం, సతీష్ పాల్గొన్నారు.


విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరిస్తున్న సింహాద్రి రమేష్‌బాబు తదితరులు

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

విజయక్రాంతి జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో సింహాద్రి రమేష్ బాబు

ప్రజాశక్తి-చల్లపల్లి

ప్రతిభకు గుర్తుగా ఇచ్చే చిన్న ప్రోత్సాహకాలే ఉన్నతంగా ఎదగటానికి పెద్ద మార్పుకు నాంది అవుతాయని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు అన్నారు. విద్యార్థుల్ని ప్రోత్సహిస్తున్న చల్లపల్లిలోని విజయ క్రాంతి జూనియర్ కళాశాలను ఇతర కళాశాలలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. శనివారం విజయ క్రాంతి జూనియర్ కళాశాలలో ఫేర్వెల్ పార్టీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కడవకకొల్లు నరసింహారావులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. 2021-22 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో మొదటి, రెండు సంవత్సరాల్లో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రూ.10116లు, రూ.5116లు చొప్పున వారి తల్లిదండ్రులకు శాసనసభ్యులు అందజేశారు. రూ.10116లు నగదు బహుమతి పొందిన వారిలో డొక్కు లక్ష్మీ దుర్గ (ఎంపీసీ ఫస్ట్ ఇయర్), పేరం కీర్తి (ఎంపీసీ సెకండ్ ఇయర్), మిరియాల విజయలక్ష్మి (సిఇసి ఫస్టియర్), బస్సు కీర్తి (సిఈసి సెకండియర్)లు ఉన్నారు. రూ.5116లు నగదు బహుమతి పొందిన వారిలో వేమూరి సాయి సత్య హారిక(ఎంపీసీ ఫస్ట్ ఇయర్), రామావతుల జీవన(ఎంపీసీ ఫస్ట్ ఇయర్), మేడేపల్లి త్రివేణి(ఎంపీసీ సెకండ్ ఇయర్), నడకుదుటి మనోహ్య(సిఇసి ఫస్టియర్), గరికపాటి నందిని (సిఈసి సెకండియర్)లు ఉన్నారు. అనంతరం సింహాద్రి రమేష్ బాబు మాట్లాడుతూ పిల్లలకు విద్యతోపాటు ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తూ ముందుకు సాగుతున్న విజయ్ క్రాంతి జూనియర్ కళాశాల వ్యవస్థాపకుల దుట్టాఉమామహేశ్వరరావు, కళాశాల కరస్పాండెంట్ దుట్టా శివప్రసాదులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మార్చి 29 నుంచి కువైట్‌కు విమాన సర్వీసులు

ప్రజాశక్తి-గన్నవరం

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం) నుంచి మరో అంతర్జాతీయ విమాన సర్వీస్‌ను ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారైంది. ఇప్పటికే షార్జాకు వారానికి రెండు విమాన సర్వీసులు నడుపుతున్న ఎయిరిండియా ఎక్స్ ప్రెస్ సంస్థ మార్చి 29వ తేదీ నుంచి కువైట్ సిటీకి మరో కొత్త సర్వీస్‌ను ప్రారంభించనుంది. విజయవాడ - కువైట్ మధ్య వారానికి ఒక సర్వీస్ నడుపుతున్నట్లు ఎయిరిండియా ఎక్స్ ప్రెస్ విడుదల చేసిన సమ్మర్ షెడ్యూల్లో ప్రకటించింది. ఈ సర్వీస్ ప్రతి బుధవారం మధ్యాహ్నం 1.10 గంటలకు ఇక్కడి నుంచి బయ లుదేరి కువైటు 3.25 (భారత కాలమానం ప్రకారం 5.55) గంటలకు చేరుతుంది. తిరిగి ఈ విమానం కువైట్లో సాయంత్రం 4.25 (భారత కాలమానం ప్రకారం 6.55) గంటలకు బయలుదేరి రాత్రి 11.50కు ఇక్కడికి చేరుకుంటుంది. విజయవాడ నుంచి కువైట్‌కు ప్రారంభ టికెట్ ధరను రూ.17,400, కువైట్ నుంచి ఇక్కడికి రూ.15,624గా నిర్ణయిం చారు. భవిష్యత్లో ఇక్కడి నుంచి దుబాయి, సింగపూర్‌కు విమాన సర్వీసులు నడిపేందుకు కూడా సన్నాహాలు జరుగుతున్నాయి.

అంతర్జాతీయ ప్రయాణానికి ఊతం

ఈ విమానాశ్రయానికి 2017 మే నెలలో కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ హోదా కల్పించింది. 2019లో ఆరునెలల పాటు విజయవాడ-సింగపూర్ మధ్య నడిచిన వారానికి ఒక సర్వీస్ సాంకేతిక రద్దయ్యింది. తర్వాత దుబై సింగపూర్‌కు అంతర్జాతీయ విమాన సర్వీస్‌లు నడిపేందుకు జరిగిన ప్రయత్నాలు కోవిడ్ పరిస్థితులతో నిలిచిపోయాయి. కేవలం వందేభారత్ మిషన్లో భాగంగా ఇక్కడి నుంచి ఒమన్ రాజధాని మస్కట్‌కు వారానికి ఒక సర్వీస్, షార్జా, కువైట్, మస్క ట్ల నుంచి వారానికి ఐదు సర్వీస్లు ఇక్కడికి నడుస్తున్నాయి. ఇటీవల అంతర్జాతీయ విమాన సర్వీస్‌లపై కేంద్రం నిషేధం ఎత్తేయడంతో ఇక్కడి నుంచి పూర్తిస్థాయిలో విదేశాలకు సర్వీస్లు నడిపేందుకు సన్నహాలు ప్రారంభమయ్యాయి. షార్జా-విజయవాడ మధ్య పూర్తిస్థాయి విమాన సర్వీసులు అందుబాటులోకి రానుండడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సర్వీస్ వల్ల యూఏఈలోని షార్జాతో పాటు దుబాయ్, అబుదాబి, అజన్, పుజిరా, రస్ అల్ ఖైమా నుంచి ఇక్కడికి సులభంగా రాకపోకలు సాగించొచ్చు. అంతేగాకుండా గల్ఫ్ లోని పలు దేశాలకు వెళ్లేందుకు షార్జా నుంచి సులభమైన కనెక్టివిటీ సదుపాయం కూడా ఉంది. భవిష్యత్ ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా దుబాయ్ నుంచి ఇక్కడికి పూర్తిస్థాయిలో సర్వీస్లు నడిపేందుకు ఎయిర్ లయన్స్ సంస్థలు ప్రయత్నాలు చేస్తున్నాయి. కువైట్ సర్వీసు మార్చి 29 నుంచి అందుబాటులోకి వస్తుంది. విదేశాలకు వెళ్లే ప్రయాణికులు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనటంతో సందేహం లేదు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం : టిడిపి

ప్రజాశక్తి-కలెక్టరేట్,(కష్ణా)

మాజీ మంత్రి కొల్లు రవీంద్రను విమర్శించే స్థాయి శాసనసభ్యుడు పేర్ని నానికి, వైసీపీ నాయకులకు లేదని టిడిపి నగర కమిటీ నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక నియోజక వర్గ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో టిడిపి స్థానిక నాయకులు మాట్లాడారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర ఇంటింటికి పాదయాత్ర చేస్తుంటే వైసీపీ పాలకులకు ఉలుకు ఎందుకని ప్రశ్నించారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే మచిలీపట్నం నియోజకవర్గంలో కోట్లాది రూపాయల అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

వచ్చి మూడున్నర సంవత్సరాల పైబడుతున్నా మచిలీపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమన్నారు. జిల్లా పరిషత్ సెంటర్ నుంచి ఇంజనీరింగ్ కళాశాల వరకు రోడ్డు విస్తరణ, రిజర్వాయర్ల నిర్మాణం, నూతన మంచినీటి పైపులైన్ల నిర్మాణం ఇలాంటి అభివద్ధి కార్యక్రమాలు ఎన్నో చేయలేదా? అని ప్రశ్నించారు. స్థానిక శాసనసభ్యుడు పేర్ని నాని మూడున్నర సంవత్సరాలుగా తన సంపాదనపై చూపిస్తున్న శ్రద్ధ, నియోజకవర్గం అభివృద్ధిపై ఎంత మాత్రం చూపించడం లేదన్నారు. గత టిడిపి ప్రభుత్వంలోనూ, ఇప్పటి వైసీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధమని ప్రకటించారు. కార్పోరేటర్లు చిత్తజల్లు నాగ రాము, దేవరపల్లి అనిత మాట్లాడుతూ సచివాలయాల్లోకి తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు వస్తే కుర్చీ కూడా వేయొద్దని బాహాటంగా పేర్ని నాని అధికారులకు చెప్పడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ దింటకుర్తి సుధాకర్, టిడిపి మచిలీపట్నం నగర ప్రధాన కార్యదర్శి, పిప్పళ్ళ వెంకట కాంతారావు, మచిలీపట్నం పార్లమెంట్ ప్రచార కార్యదర్శి పి.వి. ఫణి కుమార్, చలమలశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

120 మంది పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

స్థానిక లయన్స్ సేవా భవనంలో వడ్లమూడి విజయలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో 120 మంది నిరుపేదలకు ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు సింగంశెట్టి ఆదినారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సుభాష్ చంద్రబోస్, రాజా, శ్రీరామ మూర్తి , ఫణి గోపాల్ దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



చండీయాగం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

గుడ్లవల్లేరు మండలంలోని వేమవరంలోని శ్రీ కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం మాఘ మాస పౌర్ణమి సందర్భంగా చండీ హోమం నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్‌బాబు తెలిపారు. అమ్మవారిని సుమారు 12 వేల మంది భక్తులు దర్శనం చేసుకుని పాల పొంగళ్ళ సమర్పించి మొక్కుబడులను తీర్చుకున్నట్లు తెలిపారు. యాత్రికులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఇఒ

ఘనంగా తిరుపతమ్మ పెద్ద తిరునాళ్ల ప్రారంభం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు

స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 6.04 గంటలకు ఆలయం కార్యనిర్వహణాధికారి లీలా కుమార్, చైర్మెన్ చెన్నకేశవరావు ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం హోమగుండం వెలిగించి దీక్ష స్వాములకు గురుస్వామి రమణ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. మాఘ శుద్ధ పౌర్ణమి కావడంతో మహిళలు అమ్మవారికి పెద్ద ఎత్తున పాల పొంగళ్లు నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. శనివారం రాత్రికే ఆలయానికి చేరుకున్న యాత్రికులు ఆదివారం తెల్లవారుజామున పవిత్ర మునేటిలో స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మునేటిలో కేశఖండన శాల, జల్లు స్నానం, ఆలయంలో క్యూలైన్‌లు, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించారు. తహసీల్దార్ లక్ష్మి కళ్యాణి ఆధ్వర్యంలో యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలందించారు. గ్రామ సర్పంచ్ పద్మకుమారి ఆధ్వర్యంలో గ్రామంలో, ఆలయ పరిసరాల్లో పారిశుధ్య పనులు చేశారు.



విజయవాడ డిసిసి మేరీ ప్రశాంతి ఆధ్వర్యంలో నందిగామ ఏసిపి నాగేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐ నాగ మురళి, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు.

శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాలు నుండి వచ్చిన దీక్ష స్వాములకు, యాత్రికులకు దేవస్థానం ఆధ్వర్యంలో మునేటి అవతల గల అమ్మవారి ఆడిటోరియంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ లక్ష్మి కళ్యాణి, ఇఒ లీలాకుమార్, చైర్మన్ చెన్నకేశవరావు ప్రారంభించారు. తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరుణాలు మహోత్సవాల్లో



భాగంగా ఉభయ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున దీక్షా స్వాములు ఇరుముడులు సమర్పించేందుకు ఆలయం వద్దకు ఒకేసారి తరలిరావడంతో ఆదివారం ఆలయ పరిసరాలు ఎరుపు వర్ణంగా మారాయి. నందిగామ పట్టణ సీఐ కె.సతీష్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారి కళ్యాణం సందర్భంగా అమ్మవారికి, స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. నిత్యాన్నదాన కార్యక్రమానికి రూ.50 వేలు విరాళాన్ని అలయ అధికారులకు అందజేశారు.



వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక అంశాలు, ఆటల పాటలతో కూడిన విద్యను అందిస్తూ ఆల్ రౌండర్ నైపుణ్యాన్ని పెంపొందిస్తున్నామని రవీంద్రభారతి స్కాట్స్‌ఫైన్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ వీరమాచనేని వంశీకృష్ణ అన్నారు. కానూరులోని రవీంద్రభారతి స్కాట్స్‌ఫైన్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం సాయంత్రం పాఠశాల ఆవరణలో జరిగాయి. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల డైరెక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన బాల్యంలో మధురమైన క్షణాలు పాఠశాలలోనే గడుపుతాడని అందుకే విద్యార్థులలో సృజనాత్మకతతో కూడిన విద్యా విధానం అందిస్తున్నామని తెలిపారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న కొడాలి శేషాద్రిరావు మాట్లాడుతూ విద్యా వ్యవస్థ అనేది చాలా సులభతరం అయ్యిందన్నారు. విద్యా సంస్థలు విద్యార్థి కేంద్రంగా చక్కని బోధన చేస్తూ ముందుకు వెళుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల వివిధ ఆట పాటలతో కూడిన గీతాలు ఆహుతులను అలరించాయి.

టిడిపి కార్యకర్తలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వన్‌టౌన్: పలువురు టిడిపి కార్యకర్తలకు టిడిపి యువ నాయకులు కాండ్రేగుల రవీంద్ర ఆదివారం ఆర్థికసాయం అందచేశారు. స్థానిక 48వ డివిజన్‌లో తెలుగుదేశం పార్టీ కార్యకర్త బెహరా నవీన్ పండు నానమ్మ (బెహరా సన్యాసమ్మ) మరణించడంతో మతదేహానికి పూలమాలవేసి రవీంద్ర నివాళులర్పించారు. అనంతరం దహన సంస్కారాలకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. అలాగే తెలుగుదేశం కార్యకర్త ఒకరికి ప్రమాదం జరగ్గా అతన్ని పరామర్శించి ఖర్చుల నిమిత్తం మరో రూ.5 వేలు ఆర్థికసాయం రవీంద్ర అందజేశారు. ఈ కార్యక్రమాల్లో తెలుగుదేశం 48వ డివిజన్ అధ్యక్షులు పేరాబత్తుల రమణ, నాయకులు రాయన రాజా, పిళ్లా వెంకన్న, దాకవరపు శ్రీకాంత్, దుర్గారావు, ఈగల సాంబ, రాజగిరి అశోక్, దవులూరి బాబురావు, పిళ్లా సాయి, పిళ్లా అచ్యుతరావు, పిళ్లా వంశీ తదితరులు పాల్గొన్నారు.

గోద్రెజ్ ఇంటీరియో స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: విజయవాడ నగరం గోద్రెజ్ ఉత్పత్తులకు పెద్ద మార్కెట్, వినియోగదారుల అభిరుచి, అవసరాలకు అనుగుణంగా గోద్రెజ్ ఇంటీరియో స్టోర్ ను



ప్రారంభించినట్లు గోద్రెజ్ సంస్థ సౌత్ ఇండియా హెడ్ విపిన్ కుమార్ తెలిపారు. నగరంలోని ఐటిఐ కళాశాల రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన గోద్రెజ్ ఇంటీరియో స్టోర్‌ను బిజినెస్ హెడ్ గోపినాధ్, స్టోర్ మేనేజర్ సుకన్య, స్టోర్ నిర్వాహకులు మాధవి లతా, రామ్ ప్రసాద్‌తో కలిసి గోద్రెజ్ సంస్థ సౌత్ ఇండియా హెడ్ విపిన్ కుమార్ రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం స్టోర్ లో అందుబాటులో ఉంచిన ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా విపిన్ కుమార్ మాట్లాడుతూ విజయవాడ పెద్ద వ్యాపార కేంద్రమని, తమ ఉత్పత్తులకు పెద్ద మార్కెట్ అని పేర్కొన్నారు. వినియోగదారుల అవసరాలు తీర్చేలా గోద్రెజ్ సంస్థ ఉత్పత్తులతో విశాలమైన ప్రాంగణంలో, అధునాతన స్టోర్‌ను విజయవాడలో ప్రారంభించినట్లు తెలిపారు. గోద్రెజ్ ఎక్స్‌క్లూసివ్ స్టోర్‌లో హోమ్ ఫర్నిచర్, స్టోరేజ్, మ్యాట్రెసెస్, మోడ్యులర్ కిచెన్, ఆఫీస్ ఫర్నిచర్స్ సెక్యూరిటీ ఉత్పత్తులు లభిస్తాయని చెప్పారు. వినియోగదారులకు అందుబాటులో నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులో ఉంచామన్నారు.

శరత్‌చంద్ర ఐఎఎస్ అకాడమీకి ఉత్తమ అవార్డు

తెలుగు మీడియం విద్యార్థులకు సివిల్స్‌లో ర్యాంకు సాధనకు కృషి



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన తెలుగు మీడియం విద్యార్థులకు కూడా ఎంతో మందికి ర్యాంకులు వచ్చే విధంగా కృషి చేస్తున్నందుకు గ్లోబల్ ఇండియా ఫోరమ్ అవార్డు సాధించినట్లు శరత్‌చంద్ర ఐఎఎస్ అకాడమి మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్‌చంద్ర తెలిపారు. ఎం.జి.రోడ్డులోని శరత్ చంద్ర ఐఎఎస్ అకాడమిలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్లోబల్ ఇండియా ఫోరమ్ ఆధ్వర్యంలో ఎక్సలెన్స్-2023 అవార్డులను వివిధ రంగాలలో నిష్ణాతులకు అందచేశారన్నారు. ఇందులో భాగంగా ఐఎఎస్‌లో అత్యుత్తమ శిక్షణ అందిస్తున్నందుకు అవార్డును అందుకున్నట్లు తెలిపారు. నోవాటెల్ హోటల్‌లో ఈ నెల 4వ తేదీన జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో గవర్నర్ అవార్డు అందజేశారని తెలిపారు. గత మూడు, నాలుగేళ్లుగా శరత్ చంద్ర ఐఎఎస్ అకాడమి గ్రామీణ ప్రాంతాలకు చెందిన తెలుగు మీడియం విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి సివిల్స్‌లో ర్యాంకు వచ్చే విధంగా శిక్షణ అందించినట్లు తెలిపారు. అలాగే ఇటీవల గ్రూప్ 1 ఫలితాలలో తమ అకాడమి విద్యార్థులు అద్భుత ఫలితాలను సాధించినట్లు తెలిపారు. ప్రతి ఏటా యుపిఎస్‌సి సివిల్స్‌లో జాతీయ స్థాయి ర్యాంకులను శరత్ చంద్ర ఐఎఎస్ అకాడమి సాధిస్తుందని తెలిపారు. బెస్ట్ అకాడమి అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉందని, తనపై బాధ్యత మరింత పెరిగిందని రానున్న కాలంలో సివిల్స్‌లో మరింత స్థాయిలో ర్యాంకులు సాధించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

గుణదలలో నవదిన ప్రార్థనలు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: గుణదల మేరిమాత ఉత్సవాలలో భాగంగా జరుగుతున్న నవదిన ప్రార్థనలలో భాగంగా ఆదివారం నగరంలోని వివిధ ప్రాంతాల నుండి యాత్రికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆరో రోజు ఆదివారం సాయంత్రం విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెరాల్డ్స్ ఆఫ్ గుడ్ న్యూస్ ఫాదర్ బత్తుల జయరాజు, గుణదల పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, వికార్ జనరల్ ఫాదర్ యం.గాబ్రియేలు, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ తోట సునీల్‌రాజు, ఫాదర్ ఎం.చిన్నప్ప పాల్గొన్నారు.





8 నుండి ఉరుసు ఉత్సవాలు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ఈ నెల 8 నుండి 12వ తేద వరకు గుంటూరులో హజరత్ కాలే మస్తాన్ షా ఆవులియా బాబా 131వ ఉరుసు ఉత్సవాలు జరుగనున్నాయని ధర్మకర్త రావి రామమోహనరావు తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఉరుసు ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందూ ముస్లింలు ఐక్యంగా ఆరాధించే దైవం మస్తాన్ బాబా అన్నారు. ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈనెల 8వ తేదీన ఛాందిని అలంకరణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని అదేరోజు రాత్రి 11 గంటలకు సందల్ ఊరేగింపు ఉంటుందని తెలిపారు. ఉత్సవాలలో భాగంగా అన్ని విభాగాలుగా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఉచితంగా మందుల పంపిణీతో పాటు ప్రాథమిక చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. అలాగే నిత్యం అన్న దాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రావి డూండేశ్వరి పలువురు నిర్వాహకులు పాల్గొన్నారు.



వైవిధ్య చిత్రకారుడు టి.వి

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: టి.వెంకట్రావు (టి.వి) జీవితమే ఒక వర్ణ చిత్రమని, 60 ఏళ్ల చిత్ర కళా జీవిత సారమనీ పూర్వ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. క్రియేటివ్ ఆర్ట్ అకాడమి ఆధ్వర్యంలో మొగల్‌రాజపురంలోని కల్చరల్ సెంటర్‌లో చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ప్రారంభించిన మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ టి.వి ఒక కార్టూనిస్టుగానే కాకుండా కమ్యూనిస్టుగా, వైవిధ్యభరిత వర్ణ చిత్రకారునిగా సమాజంలోని లోటుపాట్లను ఎత్తి చూపుతూ సందేశాత్మక చిత్రాలను మనకు అందించారన్నారు. గౌరవ అతిధిగా పాల్గొన్న అంతర్జాతీయ చిత్రకారులు పద్మశ్రీ ఎస్వీ రామారావు మాట్లాడుతూ టి.వి ఒక నడిచే చిత్ర కళా ప్రదర్శనశాల అని అన్నారు. అంతర్జాతీయ కార్టూనిస్టుగా అవార్డు అందుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నగర చిత్రకారులు సన్నాల, కళాసాగర్, బాలయోగతి, ఆశీర్వాదం, కృష్ణ, సంధ్య పాల్గొన్నారు.

కాపులపై వెలంపల్లికి ద్వేషమెందుకు? : పోతిన

ప్రజాశక్తి-వన్‌టౌన్: కాపు సామాజిక వర్గంపై పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌కి అంత ద్వేషం ఎందుకని జనసేన నగర అధ్యక్షులు పోతిన మహేష్ ప్రశ్నించారు. మెగా కుటుంబం, పవన్ కళ్యాణ్ మీద పదే పదే విమర్శలు చేస్తున్నారన్నారు. వంగవీటి రాధాకృష్ణపై రెక్కీ నిర్వహించిన వారికి మద్దతు ఇచ్చారని విమర్శించారు. వైసీపీ కార్పొరేటర్ భర్త పెదబాబు ఆత్మహత్య చేసుకునేలా కేబుల్ మాఫియాను ప్రోత్సహించారని ఆరోపించారు. భవానీపురంలో కార్పొరేటర్లకు అన్యాయం చేశారన్నారు. సీనియర్ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాస్‌ని బూతు పదజాలంతో అవమానించారని మహేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.